RNI. No. APTEL/2011/41055




# ప్రభాత సమాచారం

తెలంగాణ తెలుగు దినపత్రిక




సంపుటి : 12 సంచిక : 287 ఆదిలాబాద్ ఎడిటర్ - సయ్యద్ కరీం శనివారం, 20 ఏప్రిల్ 2024 పేజీలు : 4 వెల : 2/-



# ఇక పదీ పక్కా..!

## మరో అరడజనుపై కాంగ్రెస్‌కు ఫోకస్!!

### సికింద్రాబాద్, చేవెళ్ల, మాల్కాజ్‌గిరి,మహబూబ్‌నగర్, కరీంనగర్‌లో బీజేపీతో గట్టి పోటీ

### మెదక్‌లో బీఆర్‌ఎస్‌తో టఫ్ ఫైట్ - ఆయా చోట్ల విస్తృత ప్రచారంతోపాటు చేరికలు స్పీడప్

హైదరాబాద్ : రాష్ట్రంలో ఎలాగైనా14 ఎంపీ సీట్లను గెలవాలన్న లక్ష్యంతో ఉన్న సీఎం, పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి పక్కా వ్యూహంతో ముందుకు వెళ్తున్నారు. ఇటు ప్రచారం, అటు చేరికలు.. ఇలా రెండింటినీ సమన్వయం చేసుకుంటూ టార్గెట్‌ను చేరేందుకు ఫోకస్ పెట్టారు. రాష్ట్రంలో 17 ఎంపీ సీట్లు ఉండగా, ఇందులో పది సీట్లలో గెలుపుపై రేవంత్ ఫుల్ కాన్ఫిడెన్స్‌తో ఉన్నారు. పార్టీ సర్వేల్లోనూ ఈ పదిచోట్ల విజయం పక్కా అని తేలింది. ఇక హైదరాబాద్‌ను మినహాయిస్తే.. సికింద్రాబాద్, చేవెళ్ల, మల్కాజ్‌గిరి, మహబూబ్ నగర్, కరీంనగర్, మెదక్ సీట్లలో ప్రత్యర్థి పార్టీలతో గట్టి పోటీ ఉందని రేవంత్?కు కాంగ్రెస్ వ్యూహకర్త సునీల్ కనుగోలు తాజాగా ఓ రిపోర్టు ఇచ్చారు.

పోలింగ్‌కు మరో మూడు వారాల వ్యవధి మాత్రమే ఉన్నందున వెంటనే ఆయా సెగ్మెంట్లలో ప్రత్యేక కార్యాచరణ రెడీ చేసుకోవాల్సిన అవసరాన్ని ఆయన తన రిపోర్టులో వివరించారు. సికింద్రాబాద్, చేవెళ్ల, మల్కాజ్‌గిరి, మహబూబ్ నగర్, కరీంనగర్‌లో బీజేపీతో కాంగ్రెస్ గట్టి పోటీని ఎదుర్కొంటున్నదని.. మెదక్ లో బీఆర్‌ఎస్ తో టైట్ ఫైట్ ఉందని రిపోర్టులో సునీల్ కనుగోలు పేర్కొన్నారు. దీంతో ఆ ఆరు ఎంపీ సెగ్మెంట్లలో గెలుపు వ్యూహాలకు మరింత పదును పెట్టేందుకు సీఎం రేవంత్‌రెడ్డి రెడీ అయ్యారు. అక్కడ విస్తృత ప్రచారం చేయడంతో పాటు మండల, నియోజకవర్గస్థాయిలో చేరికలను స్పీడప్ చేయాలని భావిస్తున్నారు.

**ఆ ఆరు చోట్ల ఇదీ పరిస్థితి :** సికింద్రాబాద్‌లో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి బీజేపీ నుంచి పోటీ చేస్తున్నారు. ఇక్కడ కాంగ్రెస్ తరఫున దానం నాగేందర్ బరిలో నిలిచారు. పార్టీలో సమన్వయ లోపంతో ఇక్కడ కాంగ్రెస్ కొంత వెనుకబడినట్లు సీఎం, పీసీసీ చీఫ్ రేవంత్‌కు రిపోర్టులు అందాయి. చేవెళ్లలో బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్ రెడ్డి ప్రచారంలో ముందున్నారు. ఇక్కడ కాంగ్రెస్ తరఫున సిట్టింగ్ ఎంపీ రంజిత్ రెడ్డి బరిలో నిలిచారు. ఎన్నికల షెడ్యూల్‌కు ముందే ఆయన బీఆర్‌ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి రావడంతో ఇక్కడ కాంగ్రెస్ కేడర్‌ను కలుపుకపోడంలో కొన్ని ఇబ్బందులు ఎదురవుతున్నట్లు సీఎం దృష్టికి వచ్చింది. మల్కాజ్‌గిరిలో బీజేపీ తరఫున ఈటల రాజేందర్ పోటీ చేస్తున్నారు. ఇక్కడి నుంచి కాంగ్రెస్ తరఫున వికారాబాద్ జెడ్పీ చైర్ పర్సన్ పట్నం సునీతా రెడ్డి బరిలో నిలిచారు. ఆమె చేవెళ్ల నుంచి పోటీకి రెడీ అయిన టైమ్‌లో పార్టీలో చోటు చేసుకున్న కొన్ని అనూహ్య పరిణామాలతో చివరి క్షణంలో మల్కాజ్‌గిరి బరిలో నిలవడంతో కాంగ్రెస్ లో పాత, కొత్త నేతల మధ్య కొంత కో ఆర్డినేషన్ సమస్య ఏర్పడింది. మహబూబ్‌నగర్ నుంచి కాంగ్రెస్ తరఫున వంశీచంద్ రెడ్డి బరిలో ఉన్నారు. ఇక్కడ డీకే అరుణ బీజేపీ తరఫున పోటీ చేస్తున్నారు. మహబూబ్‌నగర్ సెగ్మెంట్ సీఎం రేవంత్‌రెడ్డి సొంత జిల్లాలోని ఎంపీ సీటు కావడంతో.. ఇక్కడ కాంగ్రెస్, బీజేపీకి గెలుపు ప్రతిష్టాత్మకంగా మారింది. ఇప్పటికే సీఎం రేవంత్ రెండుసార్లు ఈ నియోజకవర్గంలో ప్రచారం సాగించారు. శుక్రవారం వంశీ చంద్ నామినేషన్ కార్యక్రమానికి కూడా ఆయన అటెండ్ కానున్నారు. ఈ సీటును గెలిచి తీరాలని పట్టుదలతో సీఎం రేవంత్ ఉన్నారు. కరీంనగర్‌లో బీజేపీ తరఫున బండి సంజయ్ బరిలో ఉండగా.. ఇక్కడ ఇప్పటికీ కాంగ్రెస్ తన అభ్యర్థిని ప్రకటించలేదు. అయితే ఈ నియోజకవర్గ ఇన్‌చార్జ్ అయిన మంత్రి పొన్నం ప్రభాకర్ గురువారం నుంచి ప్రచారం మొదలుపెట్టారు. వెలిచాల రాజేందర్ రావుకే కాంగ్రెస్ టికెట్ దక్కవచ్చనే ప్రచారం జరుగుతున్నది. మెదక్‌లో కాంగ్రెస్ తరఫున నీలం మధు బరిలో ఉండగా.. బీఆర్‌ఎస్ తరఫున ఎమ్మెల్సీ, మాజీ కలెక్టర్ వెంకట్రామి రెడ్డి పోటీలో ఉన్నారు. ఇక్కడ కాంగ్రెస్ ప్రచారాన్ని స్పీడప్ చేయాల్సిన అవసరాన్ని సునీల్ కనుగోలు నొక్కిచెప్పారు. దీంతో ఈ నెల 20న సీఎం రేవంత్ ఈ సెగ్మెంట్‌లో పర్యటించడం ద్వారా పరిస్థితిని చక్కదిద్దాలని భావిస్తున్నారు.

## ఖమ్మం రోడ్ షోలో కేంద్రమంత్రి రాజ్‌నాథ్ సింగ్ కీలక వ్యాఖ్యలు



ఖమ్మం జిల్లా, ఏప్రిల్ 19: పార్లమెంట్ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ముందుకు సాగుతోంది తెలంగాణ బీజేపీ. జాతీయ పెద్దలతో ఎన్నికల ప్రచారం నిర్వహించేలా ప్రణాళిక రూపొందించింది. ఇందులో భాగంగానే ఖమ్మం జిల్లాలో నిర్వహించిన రోడ్‌షోలో కేంద్ర రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ పాల్గొన్నారు. బీజేపీ అభ్యర్థి తాండ్ర వినోద్ రావు విజయాన్ని కాంక్షిస్తూ ఎన్నికల ప్రచారంలో రాజ్ నాథ్ సింగ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి మాట్లాడుతూ.. తెలంగాణ ఏర్పాటు కోసం, అభివృద్ధి కోసం ప్రజలు ఆశించారని.. బీఆర్‌ఎస్ అవినీతి ప్రభుత్వాన్ని ప్రజలు తరిమికొట్టారన్నారు. బీఆర్‌ఎస్, కాంగ్రెస్ రెండు అవినీతి పార్టీలే అని ఆరోపించారు. మోదీ ప్రభుత్వం మాటలు ప్రభుత్వం కాదని.. చేతల ప్రభుత్వమని స్పష్టం చేశారు. జమ్ము కాశ్మీర్ 369 ఆర్టికల్ లాంటి కీలకమైన నిర్ణయాలు తీసుకున్నామని చెప్పారు. బీజేపీ మేనిఫెస్టోలో పెట్టిన విధంగా అయోధ్యలో రామ మందిరం ఏర్పాటు చేశామని చెప్పారు. త్రిపుల్ తలాక్ ఎత్తేశామని... మహిళలకు గౌరవం ఉండాలని చట్టాలు చేశామన్నారు. మేనిఫెస్టోలో చెప్పిన విధంగా ఉమ్మడి పౌర చట్టం తీసుకుని వస్తామని హామీ ఇచ్చారు. మళ్ళీ మోదీ ప్రభుత్వమే అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ నేతలు నెహ్రూ, ఇందిరమ్మ, రాజీవ్ గాంధీ పేదరికం పోగొడుతాం అన్నారని... దేశంలో పేదరికం పెరిగిందన్నారు. మోదీ అధికారంలోకి వచ్చిన తరువాత పేదరికం పోయిందని అన్నారు. ప్రపంచ దేశాలు భారత్ ఏం చేయబోతుందని చూస్తున్నాయని... అంతటి గౌరవాన్ని మోది హయాంలో వచ్చిందని వెల్లడించారు.

ఆర్థిక స్థితిలో 11వ స్థానం నుంచి ఇప్పుడు 5 వ స్థానంలో ఉందన్నారు. గత రెండు సంవత్సరాలుగా ఉక్రెయిన్, రష్యా యుద్ధం జరుగుతోందని... మోదీఅక్కడి తెలుగు వారిని కాపాడారన్నారు. ఆయుష్మాన్ భారత్ పథకంలో 70 సంవత్సరాలు దాటిన వారికి 5లక్షల రూపాయల ఉచిత వైద్యం అందించామన్నారు. బీజేపీని గెలిపించాలని కేంద్రమంత్రి రాజ్‌నాథ్ సింగ్ కోరారు.

## రైతుల రుణమాఫీ ఎప్పుడో చెప్పిన మంత్రి పొన్నం



కరీంనగర్, ఏప్రిల్ 19: కరీంనగర్ పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపుకు కార్యకర్తలందరూ కష్టపడి పని చేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. శుక్రవారం సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ మండలం పోతారం (ఎస్)లోని శుభం గార్డెన్‌లో హుస్నాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ శ్రేణుల పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశంలో మంత్రి పాల్గొని ప్రసంగించారు. కొత్త రేషన్ కార్డులు రాబోతున్నాయని, వచ్చే ఆగష్టు 15లోపు రైతులకు రెండు లక్షల రూపాయల రుణమాఫీ కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తుందని స్పష్టం చేశారు. వచ్చే వానాకాలం పంటకి 500 రూపాయల బోనస్ ఇస్తామన్నారు. కరీంనగర్ పార్లమెంట్ సభ్యుడు బండి సంజయ్ నియోజకవర్గ అభివృద్ధికి ఏమైనా చేశాడా?, ఏదైనా గ్రామంలో తిరిగాడా? అని ప్రశ్నించారు. బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థికి వాళ్ళ పార్టీ నేతలకు కూడా చెయ్ కలుపరని వ్యాఖ్యలు చేశారు.

తాను ఎంపీగా అయిదు సంవత్సరాలు ఏం చేశానో, బండి సంజయ్, వినోద్ కుమార్ ఎంపీలుగా ఏం చేశారో చర్చిద్దాం అని సవాల్ విసిరారు. కరీంనగర్ ఎంపీ అభ్యర్థి ఎంపిక పార్టీ అధిష్టానం చూసుకుంటుందని తెలిపారు. హుస్నాబాద్ నియోజకవర్గంలోని 304 బూతులలో పార్టీ అభ్యర్థికి మెజారిటీ వచ్చేలా ప్రతి కార్యకర్త కృషి చేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ పిలుపునిచ్చారు.

# టచ్ చేసి చూడు..!

## కారు షెడ్డు నుంచి బయటకు రాదు.. తూకానికి వేయాల్సిందే..!



## కేసీఆర్ వ్యాఖ్యలపై నిప్పులు చెరిగిన రేవంత్‌రెడ్డి

### మహబూబ్‌నగర్ జిల్లాలో సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల ప్రచారం

మహబూబ్‌నగర్: కేసీఆర్ కాలం చెల్లిందని.. కారు షెడ్డుకు పోయిందని సీఎం రేవంత్‌రెడ్డి ఆరోపించారు. 20 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలు టచ్‌లో ఉన్నారని కేసీఆర్ చేసిన వ్యాఖ్యలకు సీఎం రేవంత్ స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చారు. "మా ఎమ్మెల్యేలను కంచె వేసి కాపాడుకుంటాం. ఇక్కడున్నది రేవంత్ రెడ్డి. ఈ సాయంత్రానికి నీ దొడ్లో ఎంతమంది ఎమ్మెల్యేలు ఉంటారో లెక్క పెట్టుకో" అని కేసీఆర్‌కి రేవంత్ సవాల్ విసిరారు. మహబూబ్‌నగర్ జిల్లాలో సీఎం రేవంత్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మరికాసేపట్లో మహబూబ్‌నగర్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి వంశీ చందర్ రెడ్డి నామినేషన్ వేయనున్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ శ్రేణులు భారీ ర్యాలీ తీశారు. ఈ సభలో బీఆర్‌ఎస్, బీజేపీపై సీఎం రేవంత్‌రెడ్డి తీవ్ర విమర్శలు గుప్పించారు.

**నన్ను ముట్టుకుంటే మాడిపోతారు...** 2009 లోక్‌సభ ఎన్నికల్లో కేసీఆర్‌ను పాలమూరు ప్రజలు గెలిపించారని.. గెలిపిస్తే ఆయన ఏం చేశారని ప్రశ్నించారు. కృష్ణానది పక్కనే ప్రవహిస్తున్న పాలమూరులో కేసీఆర్ ఎందుకు ప్రాజెక్టులు కట్టలేదని నిలదీశారు. విద్యా, ఉద్యోగ, ఉపాధి అవకాశాల్లో సహకరించలేదన్నారు. పరిశ్రమలను జిల్లాకు తీసుకురాలేదని.. కానీ మళ్లీ కేసీఆర్ ఓట్లు అడుగుతున్నారని మండిపడ్డారు. ఎంపీ శ్రీనివాస్‌రెడ్డి పార్లమెంట్‌లో పాలమూరు గురించి ఏనాడు మాట్లాడలేదన్నారు. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు కారును బొంద తీసి పాతి పెట్టారని ఎద్దేవా చేశారు. కారును తూకం పెట్టి అమ్ముడేనని సెటైర్లు గుప్పించారు. రేవంత్ రెడ్డి హై టెన్షన్ వైర్ అని.. ముట్టుకుంటే మాడిపోతారని హెచ్చరించారు. ఎమ్మెల్యేలను కంచె వేసి కాపాడుకుంటానని స్పష్టం చేశారు. ఇది ఆడబిడ్డల ప్రభుత్వమని.. స్వయం సహాయక బృందాలతో మహిళా సంఘాలను ఆదుకున్నామని తెలిపారు.

**ఎస్సీ వర్గీకరణ సాధిస్తాం...** కేసీఆర్ ప్రభుత్వం ఉద్యోగాలు ఇవ్వకపోయినా తాము అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లో 30 వేల ఉద్యోగాలు ఇచ్చామని స్పష్టం చేశారు. కేంద్రం నుంచి రూ.30 వేల కోట్లు నిధులను తీసుకువచ్చి పాలమూరు - రంగారెడ్డి ప్రాజెక్టు పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. గజ్వేల్ దొరలు - గద్వాల గడీల దొరసాని ప్రజలను బానిసల్లాగా మార్చుకున్నారని ధ్వజమెత్తారు. బీఆర్‌ఎస్ పాలనలో పాలమూరుకి మంత్రి పదవి ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. కాంగ్రెస్ పాలనలో పాలమూరుకి సువర్ణ అవకాశమొచ్చిందని తెలిపారు. ఎస్సీ వర్గీకరణ సాధించే బాధ్యత తమదని తెలిపారు. పాలమూరులోని రెండు పార్లమెంటు స్థానాలను గెలిపించాలని.. జిల్లాను మరింతగా అభివృద్ధి చేస్తానని మాటిచ్చారు.

**డీకే అరుణ జిల్లాకు ఏం చేశారు..? :** బీజేపీ నేత డీకే అరుణ జిల్లా అభివృద్ధికి కృషి చేయలేదని దుయ్యబట్టారు. పాలమూరు ప్రాజెక్టుకు జాతీయ హోదా ఎందుకు తీసుకురాలేకపోయారని నిలదీశారు. కాంగ్రెస్ ప్రభుత్వం మీద శాపనార్థాలు పెడుతున్నారని మండిపడ్డారు. 100 రోజులు కాకమునుపే ప్రభుత్వాన్ని కూలదోయాలని బీఆర్‌ఎస్, బీజేపీ నేతలు కుట్రలు చేస్తున్నారని విరుచుకుపడ్డారు.

10 ఏళ్ల రాష్ట్రంలో కేసీఆర్, కేంద్రంలో మోదీ పాలమూరుకు చేసిందేమీ లేదన్నారు. నాడు పలుగు, పారాబట్టి పాలమూరు నుంచి వలసలు పోయేవారని చెప్పారు. నేడు అదే పాలమూరు బిడ్డ నాయకుడై దేశం నలుమూలలు తిరిగి పాలమూరు ప్రతిష్ఠ పెంచారని అన్నారు. వంశీ చంద్ రెడ్డిని, మల్లు రవిని లక్ష మెజార్టీతో గెలిపించాలని కోరారు. రాష్ట్రంలో 14 ఎంపీ స్థానాల్లో కాంగ్రెస్‌ని గెలిపించాలని సీఎం రేవంత్‌రెడ్డి కోరారు.

# సంపాదకీయం

ప్రభాత సమాచారం
తెలంగాణ తెలుగు దినపత్రిక

## ప్రపంచాన్ని ప్రభావితం చేసే టాప్ 100లో మనోళ్లు ఎందరు?

ప్రపంచాన్ని ప్రభావితం చేసే టాప్ 100 మంది జాబితాను విడుదల చేసింది ప్రముఖ టైమ్స్ మేగజీన్. 2024 ఏడాదికి గానూ ప్రపంచంలోనే అత్యంత ప్రభావశీలురైన 100 మంది వ్యక్తుల జాబితాలో మనోళు పలువురు చోటు దక్కించుకున్నారు. అంతేకాదు.. వారు ప్రపంచాన్ని ఏ రీతిలో ప్రభావితం చేస్తున్న విషయాన్ని ప్రస్తావించారు. ఈ జాబితాలో మనోళ్ల విషయానికి వస్తే ప్రపంచ బ్యాంకు అధ్యక్షుడిగా వ్యవహరిస్తున్న అజయ్ బంగా.. మైక్రోసాఫ్ట్ సీఈవో సత్య నాదెళ్ల.. బాలీవుడ్ నటి ఆలియాభట్ మాత్రమే కాదు సినీ దర్శకుడు దేవ్ పటేల్ సైతం ఈ జాబితాలో చోటు సంపాదించారు. అయితే.. ఈ జాబితాలో చోటు దక్కించుకున్న వారికి సంబంధించిన ప్రొఫైల్ ను పలువురు ప్రముఖులు తమ వ్యాఖ్యానాల్ని జోడించటం ఆసక్తికర అంశంగా చెప్పాలి. ప్రపంచ బ్యాంకు అధ్యక్షుడిగా వ్యవహరిస్తునన అజయ్ బంగా గురించి అమెరికా ఆర్థిక మంత్రి జానెట్ యెలెన్ పేర్కొంటూ.. "ఒక కీలక సంస్థ పరివర్తనం చెందే అతి ముఖ్యమైన పనిని చేపట్టేందుకు నైపుణ్యం.. ఉత్సుకత ఉన్న నాయకుడ్ని గుర్తించటం అంత సులువు కాదు. కానీ.. గత జూన్ లో ప్రపంచ బ్యాంకు అధ్యక్షుడిగా ఎంపికైన తర్వాత అజయ్ బంగా ఆ పనిని తన చేతల్లో చేసి చూపించారు" అంటూ ప్రశంసల వర్షం కురిపించారు. అదే సమయంలో మనోడైన సత్య నాదెళ్లను ప్రస్తావిస్తూ.. 'ఆయన మన భవిష్యత్తును తీర్చిదిద్దటంలో తీవ్ర ప్రభావాన్ని చూపుతున్నారు. మానవాళికి అది మంచి విషయం కూడా" అంటూ టైమ్ మేగజీన్ పేర్కొంది. ఈ జాబితాలో చోటు దక్కించుకున్న మనోళ్ల విషయానికి వస్తే..

- అమెరికా ఇంధన శాఖ రుణ కార్యక్రమాల కార్యాలయ డైరెక్టర్ జిగర్ షా
- యేల్ వర్సిటీలో ఖగోళ.. భౌతికశాస్త్రాల ప్రొఫెసర్ ప్రియంవదా నటరాజన్
- భారత సంతతికి చెందిన రెస్టారెంట్ యజమాని అస్మా ఖాన్
- ఒలింపిక్ విజేత సాక్షి మాలిక్ తదితరులు ఉన్నారు.

సాక్షి మాలిక్ విషయానికి వస్తే.. మహిళా అథ్లెట్లను లైంగికంగా వేధించారన్న ఆరోపణలు ఎదుర్కొన్న రెజ్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా చీఫ్ బ్రిజ్ భూషణ్ సింగ్ రాజీనామా చేయాలంటూ ఆమె గళం విప్పారు. ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ఆమె ప్రారంభించిన నిరసన చిన్నగా మొదలైనప్పటికీ అనతికాలంలోనే అది పెద్దది కావటమే కాదు.. దేశ వ్యాప్తంగా ఆమె చేస్తున్న ఆందోళనకు మద్దతు లభించింది. పెద్ద ఎత్తున క్రీడాకారులు ఆమెకు బాసటగా నిలిచారు. తప్పును తప్పుగా ఎత్తి చూపుతూ.. అందరి మద్దతు కూడగట్టుకోవటమే కాదు.. మోడీ సర్కారుకు ఎట్టకేలకు తన మొండితనాన్ని వీడేలా చేసి.. చర్యలు తీసుకునే దిశగా అడుగులు వేయటంలో సాక్షి మాలిక్ కీలక భూమిక పోషించారు. ఈ జాబితాలో రష్యాకు చెందిన ప్రతిపక్ష నేత అలెక్సీ నావల్నీ సతీమణి యులియా నావల్నయాకు సైతం చోటు దక్కించుకోవటం గమనార్హం.

# కంటోన్మెంట్ పోరు.. అభ్యర్థులు ఖరారు



తాండూరు: కంటోన్మెంట్ ఎమ్మెల్యే లాస్యనందిత రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో అక్కడ ఉప ఎన్నిక వచ్చిన విషయం తెలిసిందే. ఈ స్థానాన్ని దక్కించుకోవడానికి ప్రధాన పార్టీలు తీవ్రంగా యత్నిస్తున్నాయి. దీంతో పోరు రసవత్తరంగా మారింది. కాంగ్రెస్, భారాసలు ఇప్పటికే అభ్యర్థులను ప్రకటించగా.. భాజపా ఖరారు చేసింది. మొత్తం మీద మూడు పార్టీల మధ్య పోరు హోరాహోరీగా మారింది.

**చేరికల జోష్‌లో అధికార పార్టీ..**

కాంగ్రెస్ పార్టీ ఈ స్థానాన్ని ఎలాగైనా దక్కించుకోవాలని భావిస్తోంది. మొన్నటి ఎన్నికల్లో ప్రజా గాయకుడు గద్దర్ కుమార్తె వెన్నెలను నిలపగా.. మూడోస్థానానికి పరిమితమయ్యారు. దీంతో ఉప ఎన్నికల్లో అభ్యర్థి ఎంపిక విషయంలో ఆచీతూచి వ్యవహరించారు. నియోజకవర్గంపై పట్టున్న నాయకుడిని నిలపాలనే ఉద్దేశంతో గత ఎన్నికల్లో భాజపా తరఫున రంగంలోకి దిగి 41 వేల ఓట్లకు పైగా తెచ్చుకున్న శ్రీ గణేష్‌ను పార్టీలో చేర్చుకుని ఆయనకు టిక్కెట్‌ను ప్రకటించారు. ఇతనికి ప్రజలతో మంచి అనుబంధం ఉండటమే కాకుండా అనేక సమస్యల పరిష్కారంలో పాలుపంచుకున్నారు. దీనికితోడు ఇతర పార్టీలకు చెందిన కంటోన్మెంట్ బోర్డు మాజీ సభ్యుడు జంపన ప్రసాద్, మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ కె.రాజగోపాలన్ తదితరులు కాంగ్రెస్‌లో చేరారు.

**అభివృద్ధి, సానుభూతి కలిసొచ్చే అవకాశం..**

కంటోన్మెంట్‌కు భారాస నేత సాయన్నకు విడదీయరాని బంధం ఉంది. ఆయన ఇక్కడి నుంచి అయిదుసార్లు విజయం సాధించారు. మొన్నటి ఎన్నికలకు ముందు ఆయన అనారోగ్యంతో చనిపోయారు. నవంబరులో జరిగిన ఎన్నికల్లో ఆయన కుమార్తె లాస్యనందిత బరిలో నిలిచి గెలుపొందారు. ఆమె రోడ్డు ప్రమాదంలో చనిపోవడంతో ఉప ఎన్నిక అనివార్యమైంది. ఈ టిక్కెట్ కోసం యువనేతలు చాలామంది అధినేత కేసీఆర్‌పై ఒత్తిడి తెచ్చినా సాయన్న రెండో కుమార్తె నివేదితను అభ్యర్థిగా ప్రకటించారు. గతంలో చేసిన అభివృద్ధి, సాయన్న కుటుంబం మీద ఉన్న సానుభూతి కలిసి వస్తుందని భావిస్తున్నారు.

**రాజకీయ కుటుంబ నేపథ్యం నుంచి..**

కంటోన్మెంట్‌లో బలంగా ఉన్న భాజపా ఈ ఎన్నికల్లో విజయం కోసం అన్ని ప్రయత్నాలు చేస్తోంది. మొన్నటి ఎన్నికల్లో పార్టీ తరఫున పోటీ చేసిన శ్రీ గణేష్‌తోపాటు మరికొందరు కాంగ్రెస్‌లో చేరారు. ఇదే సమయంలో రాజకీయాలకు కొత్తయిన డాక్టర్ తిలక్‌ను అభ్యర్థిగా ప్రకటించారు. 1960లో జన్మించిన ఈయన ఎంబీబీఎస్ చేశారు. ఇతని తండ్రి టీవీ నారాయణ పద్మశ్రీ అవార్డు గ్రహీత, ఆయన తల్లి సదాలక్ష్మి తొలి డిప్యూటీ స్పీకర్‌గా, మంత్రిగా పని చేశారు. తల్లిదండ్రుల నేపథ్యంతోనే తిలక్‌కు టిక్కెట్ ఇచ్చినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. కొత్త నేతకు సీనియర్ నేతల సహకారం ఇక్కడ కీలకం కానుంది. మొన్నటి ఎన్నికల్లో రెండోస్థానంలో నిలిచిన భాజపా ఈసారి విజయం సాధించాలనే పట్టుదలతో ఉంది.

# తనిఖీలు లేవు.. తవ్వకునుడే




సిరిసిల్ల : మట్టి తవ్వకాలు చేపట్టాలంటే దానికి గనులశాఖకు రాయల్టీ చెల్లించి వేబిల్లులు పొందాలి. అంతకు ముందు అది ప్రభుత్వ, ప్రైవేటుదైనా రెవెన్యూశాఖ నుంచి నిరభ్యంతర పత్రం తీసుకోవాలి. నీటి పారుదలశాఖ అయితే ఆ శాఖ అనుమతి కూడా తప్పనిసరి. అనుమతిచ్చిన ప్రాంతంలో ఎంత మేరకు తవ్వకాలు జరిగాయి అనేది గనులశాఖ అధికారులు పక్కాగా పరిశీలించాలి. కానీ ఇక్కడ అవేవీ ఉండవు. అంతా నోటి మాటలతోనే జరుగుతోంది. మధ్యమానేరు జలాశయంలో నీటి మట్టం తగ్గడంతో ముంపు గ్రామాలు తేలాయి. అక్రమార్కుల కన్ను ఆ ప్రాంతంపై పడింది. ఎఫ్‌టీఎల్ పరిధి దాటి జలాశయంలోకి చొరబడి యంత్రాలతో తవ్వకాలు చేపడుతున్నారు. పక్కా ప్రణాళికతో మట్టి దందాను నడిపిస్తూ రోజుకు రూ.లక్షల్లో సొమ్ము చేసుకుంటున్నారు. ఇంత జరుగుతున్నా ఏ శాఖ అధికారులు కూడా అటువైపు కన్నెత్తి చూడకపోవడం విస్మయానికి గురిచేస్తోంది. వేములవాడ గ్రామీణ మండలం అనుపురం, రుద్రవరం శివారులోని మధ్యమానేరు జలాశయంలో జోరుగా మట్టి తవ్వకాలు జరుగుతున్నాయి. అక్రమార్కులంతా కూటమిగా మారి ఈ మట్టి దందాను కొనసాగిస్తున్నారు. దాదాపు పదిహేను రోజులుగా యంత్రాలతో వేల క్యూబిక్ మీటర్ల మట్టిని తవ్వారు. ఇందులో మొరం లేఅవుట్లు, ప్రైవేటు నిర్మాణాలకు, నల్లమట్టిని ఇటుక బట్టీలకు తరలిస్తున్నారు. లారీ నల్లమట్టి రూ.6 వేలు, ట్రాక్టర్‌కు రూ.2,500 చొప్పున ఇటుక బట్టీలకు విక్రయిస్తున్నారు. ఒక ట్రిప్పు మొరం రూ.5 వేలు చొప్పున లారీల్లో తరలిస్తున్నారు. వీటిని సిరిసిల్ల, వేములవాడ, చందుర్తి, కోనరావుపేట, తంగళ్లపల్లి, ఎల్లారెడ్డిపేట మండలాల్లోని ఇటుక బట్టీలకు సరఫరా చేస్తున్నారు. జలాశయంలో బయటపడిన ముంపు గ్రామం నుంచి మొరం, నల్లమట్టి తరలిస్తున్న వాహనాలతో అనుపురం, రుద్రవరంలోని దారులు దుమ్ముతో నిండిపోతున్నాయి. మొదట్లో గ్రామస్థులు వాహనాలు వెళ్లకుండా అడ్డుకున్నారు. రెండు రోజులు ఆగిన తరవాత యథావిధిగా కొనసాగుతోంది. పగలు, రాత్రి తేడా లేకుండా మట్టి తవ్వకాలు చేపడుతున్నారు. తనిఖీల్లో బయటపడకుండా ఉండేందుకు జలాశయంలో తవ్వకాలను రోజుకు ఒక చోటకు మార్చుతున్నారు.

**ఎన్నికల విధుల్లో యంత్రాంగం**


జలాశయంలో రెండు నెలలుగా నీటి మట్టం కనిష్ఠ స్థాయికి పడిపోయింది. ప్రస్తుతం ఆరు టీఎంసీల నీరు మాత్రమే ఉంది. జలాశయంలో నీటి నిల్వలు తగ్గుముఖం పట్టడం, వాహనాల రాకపోకలకు మార్గం సుగమమైంది. దీనికితోడు అధికార యంత్రాంగం ఎన్నికల విధుల్లో ఉండటంతో ఇటువైపు కన్నెత్తి చూసేవారు కరవయ్యారు. ఇదే అదనుగా అక్రమార్కులకు మట్టి కాసులు కురిపిస్తోంది.

**అధికారులేమంటున్నారంటే...**

జలాశయంలో మట్టి తవ్వకాలపై జలాశయం ఈఈ జగన్‌ను సంప్రదించగా మట్టి తవ్వకాలకు ఎలాంటి అనుమతులు ఇవ్వలేదని తెలిపారు. గనులశాఖ ఏడీ క్రాంతి కుమార్ స్పందిస్తూ ఎన్‌ఓసీ, వేబిల్లులను ఎవరికీ జారీ చేయలేదని పేర్కొన్నారు. మట్టి తవ్వకాలు జరుగుతున్న విషయం ఇటీవలే మా దృష్టికి వచ్చిందన్నారు. ప్రాజెక్టు అధికారులను వెళ్లి పరిశీలించాలని సూచించినట్లు చెప్పారు. రెవెన్యూ, పోలీసుశాఖ సాయంతో తనిఖీలు చేపడతామని తెలిపారు. అక్రమార్కులపై చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

# ఆలస్యం.. ఆ అభ్యర్థులకు ఉపశమనం

పెద్దపల్లి : స్థానిక సంస్థల ఎన్నికల్లో అనర్హత వేటుకు గురైన అభ్యర్థులకు ఊరట లభించనుంది. లోక్‌సభ ఎన్నికల కారణంగా పంచాయతీ, మండల, జిల్లా పరిషత్ ఎన్నికలు ఆలస్యం కానున్నాయి. ఎన్నికల్లో పాల్గొనకుండా విధించిన నిషేధ కాలపరిమితి ఈలోగా ముగిసిపో నుంది. వీరికి పోటీ చేసే అవకాశం రానుంది. పంచాయతీ పాలక వర్గాల పదవీ కాలం ఫిబ్రవరి 1న ముగిసింది. అప్పటి నుంచి పల్లెల్లో ప్రత్యేక పాలన కొనసాగుతోంది. జూన్ 3న ఎంపీటీసీ, జులై 4న జడ్పీటీసీల పదవీ ముగియనుంది. ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి జూన్‌లో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తామని ప్రకటించడంతో అనర్హత వేటు పడిన అభ్యర్థులకు ఆంక్షలు తొలగిపోనున్నాయి.



**లెక్కలు చూపకుంటే తిప్పలే**

ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులు ప్రతి పైసాకు లెక్క చూపాల్సిందే. నూతన పంచాయతీరాజ్ చట్టం ప్రకారం 2019 జనవరిలో సర్పంచులు, వార్డు సభ్యులు, మేలో ఎంపీటీసీ, జడ్పీటీసీలు ఎన్నికలు నిర్వహించారు. ఎన్నికల ఫలితాలు వెలువడిన 45 రోజుల్లోగా అభ్యర్థులు ఖర్చుల వివరాలను అధికారులకు నివేదించాలి. ఉమ్మడి జిల్లాలో 1,212 పంచాయతీల్లో సర్పంచులు, 12,045 మంది వార్డు సభ్యులు, 52 మంది జడ్పీటీసీలు, 646 మంది ఎంపీటీసీలు ఎన్నికయ్యారు. ఎన్నికల్లో ప్రచారానికి ఎంత ఖర్చు చేశారో నిర్దేశిత నమూనాలో ఎంపీడీవోలు అభ్యర్థుల ఖర్చులను లెక్కించి నివేదించారు. ఖర్చుల నివేదికపై అవగాహన లేకపోవడం, మరోసారి పోటీ చేయబోమనే భావన, ఇతరత్రా కారణాలతో చాలా మంది లెక్కలు చూపలేదు. దీంతో 2021లో ఉమ్మడి జిల్లాలో 5,055 మంది అభ్యర్థులపై వేటు వేశారు. ఇందులో సర్పంచి స్థానానికి 410, వార్డు సభ్యులకు 4,228, జడ్పీటీసీ 30, ఎంపీటీసీ స్థానంలో పోటీ చేసిన 387 మంది అనర్హులుగా ప్రకటించారు.

**ఆంక్షలు తొలిగె.. ఆశలు చిగురించే**

ఎన్నికల్లో అనర్హత వేటు పడ్డ అభ్యర్థులకు మళ్లీ పోటీ చేసే ఆశలు చిగురిస్తున్నాయి. నోటీసులు జారీ చేసిన నాటి నుంచి మూడేళ్ల పాటు ఎలాంటి ఎన్నికల్లో పోటీచేయరాదు. సర్పంచి, వార్డు సభ్యులు, జడ్పీటీసీలు, ఎంపీటీసీలకు మే నెలాఖరు వరకు నిషేధం ఉంది. ఇప్పట్లో స్థానిక సంస్థల ఎన్నికలు సాధ్యంకాదు. షెడ్యూల్ ప్రకారం సర్పంచులు, జడ్పీటీసీలు, ఎంపీటీసీల పదవీ కాలం ముగియడానికి ముందే ఎన్నికలు నిర్వహిస్తే చాలా మంది పోటీ చేసే అవకాశం కోల్పోయేవారు. జూన్‌లో ఎన్నికలు నిర్వహిస్తామని ప్రభుత్వ ప్రకటన అనర్హత వేటు పడిన అభ్యర్థులకు మరోసారి అదృష్టం కలిసిరానుంది.

# మోగుతున్న ప్రమాద ఘంటికలు

ఆదిలాబాద్ : నాలుగేళ్ల కిందటి నీటి కష్టాలు మళ్లీ పునరావృతం కాబోతున్నాయి. నిర్మల్ జిల్లాను ఆనుకొని ఉన్న శ్రీరాంసాగర్ జలాశయంలోని నీటిమట్టం తగ్గడంతో ప్రమాద ఘంటికలు మోగుతున్నాయి. నిర్మల్, ఆదిలాబాద్ జిల్లాల్లో పలు నివాసిత ప్రాంతాల్లో నీటి కష్టాలు మొదలు కానున్నాయి. ప్రతి ఒక్కరికి మిషన్ భగీరథ నీరు అందించేందుకు నిర్మల్ జిల్లా శ్రీరాంసాగర్ జలాశయం నీటిని వినియోగించేలా పథకం రూపొందించారు. ఇందుకోసం నిర్మల్ జిల్లా సోన్ మండలం లోకల్‌వెల్మల్ గ్రామం గోదావరి నదీ తీరాన ఈ ఇన్‌టేక్‌వెల్ నిర్మించారు. ప్రత్యేకంగా నిర్మించిన కెనాల్ ద్వారా ఇన్‌టేక్‌వెల్‌కు నీళ్లు వస్తాయి. అక్కడి నుంచి 25 కిలోమీటర్ల దూరంలో ఉన్న దిలావర్‌పూర్ మండలం మాటేగావ్ వద్ద నీటి శుద్ధి కేంద్రం (ఫిల్టర్‌బెడ్-వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్) ఏర్పాటు చేశారు. ఇలా శుద్ధికేంద్రం నుంచి గోదావరి నీళ్లు నిర్మల్ నియోజకవర్గం, ఆదిలాబాద్, బోథ్ నియోజకవర్గాలకు సరఫరా చేస్తున్నారు.

**10 టీఎంసీల కంటే తగ్గితే బురద నీరు**

సాధారణంగా ఎస్సారెస్పీలో నీటి సామర్థ్యం 90 టీఎంసీలు. ప్రస్తుతం 11 టీఎంసీలకు నీటి మట్టం తగ్గింది. ఒక వేళ 10 టీఎంసీలకు తగ్గితే బురదనీరు వస్తుంది. ఫలితంగా తాగునీటి సరఫరాలో అంతరాయం ఏర్పడి ప్రజలకు కష్టాలు ఎదురు కానున్నాయి. ప్రస్తుతం 11 టీఎంసీల నీటిలో కొంత రైతులకోసం పంట చేలకు అందిస్తుండటంతో రోజురోజుకు నీటి మట్టం తగ్గుతోంది. మూడు కాలువల నుంచి రోజుకు 6 వేల క్యూసెక్కుల నీరు చేలకు ఇస్తున్నారు. నీటి మట్టం ఇంకా తగ్గితే మున్ముందు తాగునీటికి ఇబ్బందులు ఎదురయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. లోకల్‌వెల్మల్ గ్రామం వద్ద నిర్మించిన ఇన్‌టేక్‌వెల్ ఎత్తుప్రాంతంలో ఉన్నందున ప్రాజెక్టులో డెడ్‌స్టోరేజీలో నీటి మట్టం ఉన్నా వినియోగించుకోలేని పరిస్థితి నెలకొంది.



2019లో కటకట..మిషన్ భగీరథ పథకం ప్రారంభమైన ఏడాదికే ఎస్సారెస్పీలో నీటి మట్టం తగ్గడం ఆ సమయంలో ఆందోళనకు దారితీసింది. 2019లో జేసీబీతో పూడిక తీయాల్సి వచ్చింది. డెడ్‌స్టోరేజీ నుంచి నీళ్లను వినియోగించుకునేందుకు ప్రత్యేకంగా రహదారి నిర్మించారు. మోటార్లతో డెడ్‌స్టోరేజ్ నీటిని ఎత్తిపోతల పథకం ద్వారా ఎత్తి ఇన్‌టేక్‌వెల్‌లో పోసి ప్రజల దాహార్తి తీర్చారు. అప్పట్లో రెండు మూడు రోజులకోమారు నీటిని అందించారు. ప్రస్తుతం అదే పరిస్థితి పునరావృతమవుతుందనే ఆందోళన అధికారుల్లో కనిపిస్తోంది.

**ఉన్నతాధికారులకు నివేదించాం**

సురేష్, మిషన్ భగీరథ ఎస్ఈప్రాజెక్టులో నీటి మట్టం తగ్గడంతో ఎదురయ్యే పరిస్థితులను అంచనా వేశాం. నీటి కష్టాలు వస్తాయనే ఉద్దేశంతో ముందుగానే మా శాఖ ఉన్నతాధికారులకు, నిర్మల్, ఆదిలాబాద్ జిల్లా పాలనాధికారులకు నివేదించాం. ప్రజలకు ఇబ్బంది రాకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తాం.

# అక్షరాలై వెలిగే చోట.. ఆగని కన్నీళ్లు

ఆదిలాబాద్ : నిర్మల్ జిల్లా బాసరలోని రాజీవ్‌గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం(ఆర్జీయూకేటీ) ప్రాభవం విద్యార్థుల వరుస బలవన్మరణాలతో మసకబారుతోంది. ప్రభుత్వాల పట్టింపులేనితనం, ఉన్నతాధికారుల ఏకపక్ష నిర్ణయాలమధ్య భవిష్యత్తును ఊహించుకోలేని అంతర్ముఖులైన విద్యార్థుల భావిజీవితం అగమ్యగోచరంగా మారుతోంది. కనిపెంచిన తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులకు దూరంగా ఆర్జీయూకేటీ వసతిగృహాల్లోనే ప్రాణాలు తీసుకోవటం విషాదాన్ని నింపుతోంది. విశ్వవిద్యాలయం ప్రారంభమైన 2008 మొదలుకొని 2023 జూన్ 13 వరకు 15 మంది విద్యార్థులు ఆత్మహత్యలకు ఒడిగడితే.. 2023 జూన్ 15 నుంచి తాజాగా మంగళవారం సిద్దిపేట జిల్లా విద్యార్థి ఆత్మహత్య వరకు మరో ఆరుగురు బలవన్మరణాలకు పాల్పడటంతో ఆర్జీయూకేటీ విషాదాశ్రువుల కేంద్రంగా నిలిచినట్లవుతోంది. చనిపోతున్నవారందరూ గ్రామీణ, పేద విద్యార్థులే. నూతన వాతావరణం, కొత్త పరిచయాలకు అనుగుణంగా భావి జీవితాన్ని నిర్దేశించుకునే క్లిష్ట పరిస్థితులను తట్టుకోలేక జీవితాలను అర్ధంతరంగా ముగించుకోవటం విషాదానికి కారణమవుతోంది.

లక్ష్యమేంటి పల్లెలోని ప్రభుత్వ పాఠశాలల్లో పదోతరగతిలో ప్రతిభ కనబర్చే విద్యార్థులను మారుతున్న కాలానికి అనుగుణంగా సాంకేతిక, వైజ్ఞానిక రంగాల్లో ఉన్నతంగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో 2008 మార్చిలో ఆర్జీయూకేటీ ఏర్పడింది. రాష్ట్రంలో మిగిలిన విశ్వవిద్యాలయాలకు భిన్నంగా ఇది సాంకేతిక విద్యకు మాత్రమే ప్రాధాన్యం కలిగిన విద్యాలయంగా ప్రసిద్ధి పొందింది. రాష్ట్ర ఆవిర్భావానికి ముందే ఉమ్మడి రాష్ట్రానికి చెందిన ప్రతిభ కలిగిన గ్రామీణ విద్యార్థులకు ప్రవేశం ఉండేలా విశ్వవిద్యాలయం రూపకల్పన జరిగింది. పైగా 2008 నుంచి 2010 వరకు ఏడాదికి 2 వేల మంది విద్యార్థులకు ప్రవేశం కల్పించే విధానం అమలైతే 2010 నుంచి వెయ్యికి తగ్గించారు. తర్వాత 2015లో విశ్వవిద్యాలయం బడ్జెట్‌ని పెంచుకునే ఆలోచనతో గ్రామీణ ప్రాంత విద్యార్థులతో సంబంధం లేకుండా విద్యార్థులెవరైనా రూ.లక్ష ఫీజుతో గ్లోబల్ సీట్ కింద అదనంగా వంద సీట్లు భర్తీ చేసే ప్రక్రియ ప్రారంభమైంది.

కలవరపాటుకు కారణమిదే!2023 విద్యాసంవత్సరం నుంచి సెమిస్టర్ పరీక్షలకు బదులు యానువల్ మోడ్(వార్షిక విధానం) అమలు చేయడం విద్యార్థులపై ప్రభావం పడింది. సెమిస్టర్ విధానమైతే వెనకబడిన సబ్జెక్టుల్లో నాలుగు నెలల్లో విద్యార్థి లోపాలను సవరించుకుని తర్ఫీదు పొందే వెసులుబాటు ఉండేది. వార్షిక విధానంలో సిలబస్ పూర్తయినా కాకపోయినా విద్యా సంవత్సరాంతంలో ఒకేసారి పరీక్షలు రాసే విధానం అమల్లోకి రావటం విద్యార్థులను కలవరపాటుకు గురిచేస్తోంది. ఆర్థిక సమస్యలు, అనారోగ్యం, కొత్త పరిచయాలతో దిగాలుగా ఉండే విద్యార్థులను గుర్తించి మానసిక నిపుణులతో కౌన్సెలింగ్ ఇచ్చే విధానం లేదు. రెగ్యులర్ వీసీ లేకపోవటం సమస్యలన్నింటికీ ప్రధాన కారణంగా నిలుస్తోంది. ఇదే ప్రధాన డిమాండ్‌గా 2022 జూన్‌లో విద్యార్థులంతా నెలరోజుల పాటు మూకుమ్మడిగా ఆందోళన దిగటంతో అప్పటి కేసీఆర్ సర్కార్ దిగివచ్చింది. నెలరోజుల్లోగా అన్ని సమస్యలు తీరుతాయని అప్పటి మంత్రులు కేటీఆర్, సబితా ఇంద్రారెడ్డి, ఇంద్రకరణ్‌రెడ్డి ఇచ్చిన హామీలు ఆచరణకు రాలేదు. ప్రస్తుతం రేవంత్‌రెడ్డి సర్కారు ఏర్పడినప్పటికీ శాశ్వత వీసీ నియామకం జరగక విశ్వవిద్యాలయంపై పర్యవేక్షణ కొరవడుతోంది. విషయాలు బయటకు పొక్కకుండా భయపెట్టడం మినహా రెండేళ్ల కిందట విద్యార్థులు లేవనెత్తిన అంశాలేవీ పరిష్కారం కాలేదు. ఫలితంగా కొత్తగా ప్రవేశాలు పొందుతున్న విద్యార్థులు నూతన విధానంపై అవగాహన చేసుకోలేక తనువు చాలించడానికి దారితీస్తోంది.

## రేషన్ ఈ- కేవైసీకి మరో అవకాశం.. త్వరగా పూర్తి చేసుకోవాలని అధికారుల సూచన

భువనగిరి : ఆహారభద్రత కార్డుల ఈ- కేవైసీ నమోదుకు ప్రభుత్వం మరో అవకాశం కల్పించింది. ఫిబ్రవరి 29తో గడువు ముగిసినప్పటికీ రేషన్ దుకాణాల్లో ప్రభుత్వ సూచన మేరకు ప్రస్తుతం ఈ-కేవైసీ ప్రక్రియ కొనసాగుతోంది. మొత్తం లబ్ధిదారుల్లో 74 శాతం మాత్రమే ఇప్పటి వరకు నమోదు చేసుకున్నారు. మిగిలిన వారి కోసం మరో అవకాశం ఉండకపోవచ్చని, త్వరగా ఈ కేవైసీ పూర్తి చేసుకోవాలని సంబంధిత పౌరసరఫరాల శాఖ అధికారులు సూచిస్తున్నారు. ఉమ్మడి నల్గొండ జిల్లాలో 1,740 గ్రామ పంచాయతీలకు గానూ 2,081 రేషన్ దుకాణాలున్నాయి. ఇందులో మొత్తం 10,07,214 రేషన్ కార్డులుండగా, 29,85,553 మంది రేషన్ లబ్ధిదారులున్నారు. ఇంకా వివిధ కారణాల వల్ల 7,96,023 మంది ఈ కేవైసీ చేయించుకోనట్లుగా అధికారవర్గాలు తెలుపుతున్నాయి.

సంక్షేమ పథకాలు అర్హుల లబ్ధికే..

సంక్షేమ పథకాలు అర్హులకే అందించడానికి ప్రభుత్వం పకడ్బందీగా చర్యలు చేపట్టింది. అందులో భాగంగానే రేషన్ కార్డులకు ఈ- కేవైసీ తప్పనిసరి చేసింది. దీని కోసం శాఖాపరంగా అవగాహన కార్యక్రమాలు సైతం చేపట్టారు. ఈ విషయమై తమకు అందుబాటులో ఉన్న రేషన్ దుకాణాలకు వెళ్లి ఈ కేవైసీ చేసుకోవాలని పౌరసరఫరాల అధికారులు సూచించారు. పలు దఫాలుగా అవకాశం ఇచ్చినా ఇంకా మిగిలిపోయిన కారణంగా ఎక్కువ మందికి నష్టం కలిగే అవకాశం ఉందని భావించిన ప్రభుత్వం రేషన్ దుకాణాల్లో నమోదు చేసుకోవడానికి మరోమారు అవకాశం కల్పించింది. అవకాశాన్ని సద్వినియోగ పరచుకోవాలని అధికారులు కోరుతున్నారు.




ప్రధాన సమస్యలివే..వేలిముద్రలు పడక, సాంకేతిక సమస్యలతో కొంతమేర జాప్యం జరుగుతోంది. దీనికితోడు చిన్నారుల ఆధార్ నవీకరణ కాకపోవడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. పలువురు వృద్ధుల వేలిముద్రలు పడటం లేదు. మీసేవా, ఆధార్ కేంద్రాలకు వెళ్లి నవీకరణ పూర్తి చేసుకున్నా ఈ కేవైసీ ప్రక్రియలో వేలిముద్రలు రావడంలేదు. వలస వెళ్లిన వారి కోసం అక్కడుండే రేషన్ షాపుల్లో ఈ కేవైసీ చేసుకునే వెసులుబాటు ఉన్నా కొందరు డీలర్లు తమ పరిధిలోని వారికే కేవైసీ చేస్తున్నారనే ఆరోపణలున్నాయి. ఈ కేవైసీ ఆవశ్యకత విషయమై రేషన్ డీలర్లకు, లబ్ధిదారులకు అధికారులు పలు రకాలుగా సూచనలు చేస్తూనే ఉన్నారు. అవకాశం ఉందికదా అని నిర్లక్ష్యం చేయకుండా తక్షణమే రేషన్ దుకాణాలకు వెళ్లి ఈ కేవైసీ చేయించుకోవాలంటున్నారు.

# అక్రమాలపై కన్ను..!

నల్గొండ : కొనుగోలు కేంద్రాల ద్వారా ప్రభుత్వం సేకరించిన ధాన్యాన్ని బహిరంగ మార్కెట్లో అధిక ధరలకు అమ్ముకోవడంతో పాటూ భారత ఆహార సంస్థ (ఎఫ్‌సీఐ)కి సకాలంలో ఇవ్వాల్సిన సీఎంఆర్ బియ్యాన్ని ఇవ్వకుండా తాత్సారం చేస్తున్న మిల్లులపై అధికారులు కొరడా ఝులిపించారు. సూర్యాపేట జిల్లా అధికార యంత్రాంగం, విజిలెన్స్ అధికారులు సంయుక్తంగా మిల్లుల్లో అక్రమాలపై ఎక్కువగా ఫిర్యాదులు వస్తున్న తిరుమలగిరి, సూర్యాపేట, కోదాడ, హుజూర్‌నగర్, గరిడేపల్లి, తుంగతుర్తిలోని సుమారు 15 మిల్లులపై మంగళవారం ఏకకాలంలో సోదాలు నిర్వహించారు. ఇందులో సీఎంఆర్ బియ్యంతో పాటూ పలు మిల్లుల్లోని రికార్డుల్లో తప్పులు ఉన్నట్లు అధికారులు గుర్తించారు.

కొంత మంది మిల్లర్లు సిండికేట్‌గా ఏర్పడి ప్రభుత్వానికి ఇవ్వాల్సిన సుమారు రూ.300 కోట్ల మేర బియ్యం చెల్లింపుల్లో అక్రమాలు, అవకతవకలకు పాల్పడ్డారని కొంత మంది రాష్ట్ర ఉన్నతాధికారులకు, ప్రభుత్వ పెద్దలకు ఫిర్యాదులు చేయడంతో.. ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ చేయాలని జిల్లా ఉన్నతాధికారులకు ఆదేశాలు అందినట్లు తెలిసింది. దీంతో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసిన కలెక్టరు వెంకట్‌రావు..గతం నుంచి పలు ఆరోపణలు ఉన్న మిల్లులపై దాడులు నిర్వహిస్తున్నారు. పోలీసుల పర్యవేక్షణలో విజిలెన్స్, పౌరసరఫరాలు, జిల్లా అధికార యంత్రాంగం అందరూ సంయుక్తంగా ఇంత పెద్ద మొత్తంలో ఏకకాలంలో దాడులు చేయడం ఇటీవలి కాలంలో ఇదే ప్రథమం. రాష్ట్ర వ్యాప్తంగా సీఎంఆర్ బియ్యం చెల్లింపుల్లో గతం నుంచి సూర్యాపేట జిల్లా అట్టడుగు స్థాయిలోనే ఉంది. సీఎంఆర్ బియ్యం చెల్లింపుల్లో అక్రమాలపై 'మారని తీరు...మరాడించరు వారు' అన్న శీర్షికన కథనం ప్రచురితమైన సంగతి తెలిసిందే.

అదుపులో మిల్లర్ల సంఘ నాయకుడు..!

ప్రభుత్వానికి ఇవ్వాల్సిన వందల రూ.కోట్ల విలువైన బియ్యం ఎగవేతతో పాటూ తాజా యాసంగి సీజన్‌లో తన, బినామీలకు చెందిన సుమారు నాలుగు మిల్లుల్లో ప్రభుత్వం సేకరించిన ధాన్యాన్ని తీసుకోకుండా ప్రయత్నాలు చేసిన జిల్లాకు చెందిన మిల్లర్ల సంఘం కీలక నాయకుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. నాలుగు మిల్లుల్లో కలిపి సదరు నేత సుమారు రూ.200 కోట్ల బియ్యం ప్రభుత్వానికి అప్పగించాల్సి ఉందని సమాచారం. భారీగా బకాయిలతో పాటూ తాజా సీజన్‌లో అధికారులకు సహకరించకుండా ఉండటంతో జిల్లా అధికారులు సైతం రాష్ట్ర పెద్దలకు సమాచారం ఇవ్వడంతో హైదరాబాద్ కేంద్రంగా ఓ కీలక నాయకుడి ఆదేశంతో సదరు నేతను అదుపులోకి తీసుకొని ప్రశ్నిస్తున్నట్లు సమాచారం. ఇందులో అధికార యంత్రాంగంతో పాటూ విజిలెన్స్ అధికారులు పాల్గొన్నట్లు తెలిసింది. అయితే సదరు నేతతో అంటకాగిన అధికారులు, నేతలు ఎవరనే దానిపైనా ఆరా తీస్తున్నారు. ఒకట్రెండు రోజుల్లో ఈ అక్రమాలపై విజిలెన్స్ కేసులు నమోదు చేయనున్నట్లు సంబంధిత వర్గాల ద్వారా తెలిసింది. సదరు నాయకుడితో పాటూ గరిడేపల్లి, నేరేడుచర్ల, తిరుమలగిరి, తుంగతుర్తి, సూర్యాపేట గ్రామీణ మండలాల్లో అక్రమాలకు పాల్పడిన మిల్లులపైనా తీవ్ర చర్యలకు అధికారులు సిఫార్సులు చేస్తున్నారు. నాలుగైదేళ్ల పాటు ఇక్కడ పనిచేసిన ఓ అధికారి వత్తాసుతోనే సదరు నాయకుడు రూ.కోట్ల విలువైన బియ్యాన్ని ప్రభుత్వానికి ఇవ్వకుండా బహిరంగ మార్కెట్లో విక్రయించారని గతంలోనే ఆరోపణలు రాగా...హైదరాబాద్ స్థాయిలో పైరవీ ద్వారా వీటన్నింటినీ బహిర్గతం కాకుండా చూశారు. గతంలో బ్లాక్‌లిస్టులో పెట్టి తిరిగి ధాన్యం కేటాయింపులు చేస్తున్న మిల్లుల్లోనూ రికార్డులు అధికారులు సమగ్రంగా తనిఖీ చేస్తున్నారు.

# గనుల వ్యర్థాలు.. ఆదాయ నిక్షేపాలు



తాండూరు: జిల్లాలోని నాపరాళ్ల వ్యర్థాలను సిమెంటు కర్మాగారాలకు విక్రయిస్తే గనుల శాఖకు రూ.కోట్ల కొద్ది ఆదాయం సమకూరే అవకాశం ఉంది. అయితే ఆ దిశగా అధికారులు దృష్టి సారించడం లేదు. ప్రస్తుతం ఇబ్బడిముబ్బడిగా కుప్పలు పేరుకుపోయాయి. దశాబ్దం క్రితమే ప్రతిపాదన నాపరాళ్ల వ్యర్థాలను సమీపంలోని సిమెంటు కర్మాగారాలకు విక్రయించి ఆదాయం పొందాలనే ప్రతిపాదన దశాబ్దం క్రితమే వచ్చింది. ఆ మేరకు గనుల శాఖ నాపరాళ్ల వ్యర్థాల విక్రయ విషయాన్ని ఉన్నతాధికారులకు పంపించారు. వీరు దస్త్రాన్ని ముఖ్యమంత్రి కార్యాలయానికి పంపించారు. అయితే ఇప్పటికీ సదరు దస్త్రానికి మోక్షం లభించలేదు.

సిమెంటు కర్మాగారాల యజమానుల మెలిక: దశాబ్దం కిందట గనుల శాఖ అధికారులు సీసీఐ, ఇండియా సిమెంట్స్, పెన్నా కర్మాగారాల యజమానులతో గనుల శాఖలోని ఉన్నతాధికారులు వ్యర్థాల కొనుగోలు విషయంలో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. వ్యర్థాలను వినియోగించి సిమెంటును ఉత్పత్తి చేయొచ్చని వివరించారు. వ్యర్థాలను సిమెంటు ఉత్పత్తికి వినియోగించడానికి తాము సిద్ధమే అని ఇండియా సిమెంట్స్ అంగీకారం తెలిపింది. అయితే తమకు వ్యర్థాలను ఉచితంగా ఇవ్వాలని పేర్కొంది. మిగిలిన కర్మాగారాలు కూడా అదే విషయాన్ని వెల్లడించాయి. దీనికి అధికారులు ససేమిరా అన్నారు. టన్ను నాపరాయికి చెల్లించే రాయల్టీలో నాణ్యతను బట్టి 30 నుంచి 50 శాతం చెల్లించాలని అధికారులు సూచించారు. పరిశీలిస్తామని కర్మాగారాల యజమానులన్నారు. వ్యర్థాలకు రాయల్టీని చెల్లించే ధరావత్తు నిర్ణయించాలని కోరుతూ ఉన్నతాధికారులకు దస్త్రాన్ని పంపించారు. అక్కడి నుంచి నిర్ణయం కోసం ముఖ్యమంత్రి కార్యాలయానికి వెళ్లింది. తరువాత కదలిక లేదు.వచ్చే ఆదాయం రూ.19.50కోట్ల నుంచి రూ.32.50 కోట్లు: రాయల్టీలో 30 నుంచి 50 శాతం వసూలయ్యే విధంగా వ్యర్థాలను విక్రయించినా గనుల శాఖకు రూ.19.50 కోట్ల నుంచి రూ.32.50 కోట్లు సమకూరే అవకాశం ఉంది. ప్రస్తుతం టన్ను నాపరాయికి రాయల్టీ ఫీజు రూ.130గా ఉంది. అయితే పెండింగులో ఉన్న దస్త్రానికి మోక్షం లభిస్తేనే ఇది జరుగుతుంది. ఆ మేరకు గనుల శాఖ కృషి చేయాల్సిన అవసరం ఉంది.

50 లక్షల మెట్రిక్ టన్నుల పైమాటే..తాండూరు మండలం మల్కాపూర్, కరణ్‌కోట, ఓగిపూరు, సంగెం కలాన్, బషీరాబాద్ మండలం నవల్గా, క్యాద్గిర, ఎక్మాయి గ్రామాల్లో వందల ఎకరాల్లో నాపరాయి గనులు ఉన్నాయి. ఇవే భూముల్లో 150కి పైబడి గనులు కొనసాగుతున్నాయి. యజమానులు కార్మికులతో నాపరాళ్లను పలకలుగా పైకి తీయించే సమయంలో, లోడింగ్ సమయంలో, యంత్రాలతో ప్రమాణాల మేరకు కత్తిరించినపుడు ముక్కలుగా మారుతున్నాయి. ట్రాక్టర్లు, టిప్పర్లలో నింపించిన వ్యర్థాలను గనుల గట్లు, ఖాళీ ప్రదేశాల్లో పోస్తూ వస్తున్నారు. ఇలా దాదాపు నాలుగు దశాబ్దాల నుంచి కుప్పలుగా పోసుకుంటూ వచ్చినవి 50 లక్షల మెట్రిక్ టన్నులకు పైగానే పేరుకు పోయాయి.వీటిని తొలగిస్తే భూమి చదునుగా మారుతుంది. మళ్లీ నాపరాళ్లను వెలికి తీసే గనులుగా మార్చవచ్చు. రాయల్టీల రూపంలో అదనంగా ఆదాయం పొందొచ్చు.

# రైల్వేస్టేషన్లలో మురుగు నీటి రీసైక్లింగ్..



హైదరాబాద్: ఎండలు మండిపోతున్నాయి. భూగర్భ జలాలు అడుగంటాయి. నగరంలో నీటి కటకట ఏర్పడడంతో ఉద్యానాలు ఎండిపోతున్నాయి. దీనికంతటికీ కారణం నీరు తగినంత లేకపోవడమేనని సమాధానం వస్తుంది. కానీ దక్షిణమధ్య రైల్వే అలాంటి మాటకు తావులేదంటోంది. రైళ్లను కడిగిన నీటితో పాటు.. సాధారణ అవసరాలకు వినియోగించే నీటిని వృథా చేయకుండా.. శుద్ధిచేసి మళ్లీ వాడుతోంది. ఇప్పటికే సికింద్రాబాద్, కాచిగూడ, హైదరాబాద్ స్టేషన్లలో మురుగునీటి శుద్ధి ప్లాంట్లను ఏర్పాటు చేయగా.. తాజాగా చర్లపల్లి రైల్వే స్టేషన్లోనూ సిద్ధం చేస్తోంది.

సికింద్రాబాద్‌లో ప్రప్రథమం..

భారతీయ రైల్వేలోనే మొట్టమొదటి మురుగునీటి శుద్ధి కేంద్రాన్ని సికింద్రాబాద్ రైల్వేస్టేషన్లో ఏర్పాటు చేశారు. ఇక్కడి ప్రయోగాలు, తద్వారా ఒనగూరిన ప్రయోజనాలు.. దేశంలోని ముఖ్యమైన రైల్వేస్టేషన్లలో కేంద్రాల ఏర్పాటుకు ఊతమిచ్చింది. సికింద్రాబాద్ రైల్వేస్టేషన్లో రోజుకు 1.50 లక్షల లీటర్ల నీటిని ఇలా ఉత్పత్తి చేస్తున్నారు. కాచిగూడలో 1.50లక్షల లీటర్లు.. హైదరాబాద్ రైల్వేస్టేషన్లో 2 లక్షల లీటర్ల నీటిని ఈ మురుగునీటి శుద్ధి ప్లాంట్ల ద్వారా ఉత్పత్తి చేస్తున్నారు. ఇప్పుడు చర్లపల్లి రైల్వేస్టేషన్లో కూడా రోజుకు 2 లక్షల లీటర్లను ఉత్పత్తి చేసేలా మురుగునీటి శుద్ధి ప్లాంట్‌ను ఏర్పాటు చేస్తున్నారు.

శుద్ధి చేసిన జలాలతో..రైల్వేస్టేషన్లలో శుద్ధి చేసిన నీటితో ఉద్యానాల నిర్వహణ, మొక్కలకు నీళ్లు అందిస్తున్నారు. దూరప్రాంతాల నుంచి వచ్చే రైళ్లను కడగడానికి, ప్లాట్‌ఫాంలు, రైల్వే ట్రాక్‌లను కడిగేందుకు వినియోగిస్తున్నారు. మళ్లీ అదే నీటిని ఒడిసి పట్టి మురుగునీటి శుద్ధి ప్లాంట్‌కు చేరేలా ఏర్పాట్లు చేశారు. మూడు రైల్వేస్టేషన్లలో నీటిశుద్ధి కేంద్రాల ద్వారా 5 లక్షల లీటర్ల నీటిని అందుబాటులోకి తెచ్చి.. వృథాకు అడ్డుకట్ట వేయడమే కాకుండా.. లక్షల లీటర్లను పొదుపు చేస్తున్నారు. ఇలా రోజుకు 5 లక్షల లీటర్లను నీటిని పొదుపు చేయడమంటే.. నెలకు కనీసం రూ.10 లక్షలకు పైగా పొదుపు చేసినట్టవుతుందని అక్కడి ప్లాంట్ల నిర్వాహకులు చెప్పారు.

సిటీ డిపోల్లో నీటి కటకట

బస్సులు కడిగేందుకు నీళ్ల కరవు

తుడుస్తూ సరిపెడుతున్న వైనం

నగరంలో నీటి కష్టాలు వర్ణనాతీతంగా ఉన్నాయి. భూగర్భ జలాలు అడుగంటడంతో బోర్లు ఎండిపోయాయి. దీంతో నీటితో కడిగే దగ్గర తడి వస్త్రంతో తుడుస్తున్నారు. ఇందుకు నగరంలో తిరిగే బస్సులు సైతం అతీతం కాదు. ప్రతి డిపోలో బస్సులను నీటితో శుభ్రం చేసే వ్యవస్థలున్నాయి. కానీ నీటికొరత వల్ల అవి పని చేయడంలేదు. దీంతో బస్సులు దుమ్ముకొట్టుకు పోవడంతో సిటీ బస్సుల్లో ప్రయాణించే మొదటి ప్రయాణికుడు సీటును తుడుచుకుని కూర్చోవాల్సి వస్తోంది.

తుడుస్తున్నా తొలగని దుమ్ము.. డిపోలకు చేరిన బస్సులను మరుసటి రోజు శుభ్రంగా కడిగేవారు. వారానికి ఒకసారి బస్సును మొత్తం కడిగి తుడుస్తారు. నీరు పుష్కలంగా ఉన్నప్పుడే బస్సుల శుభ్రత అంతంత మాత్రంగా ఉండేది. ప్రస్తుతం నీరు లేకపోవడంతో బస్సు లోపలి భాగంలో తుడుస్తున్నారు. ఇది సైతం వారం పది రోజులకోసారి చేస్తుండడంతో సీట్లన్నీ దుమ్ముకొట్టుకుపోతున్నాయి. నగర శివారు డిపోల్లో బోర్లు పని చేస్తుండడంతో షెడ్యూల్ ప్రకారం తుడుస్తున్నామని చెబుతున్నారు. కొన్ని డిపోల్లో ట్యాంకర్ల ద్వారా నీళ్లు తెస్తున్నప్పటికీ వారానికోసారి బస్సు బయట శుభ్రం చేసి వదిలేస్తున్నారు. లోపల వైపు తుడవడంతో ఆ దుమ్ము బస్సు సీట్లపై పడి ప్రయాణికులకు ఇబ్బందిగా మారుతున్నాయి.

# గౌరవ వేతనం జాడేది?

కరీంనగర్ : నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో ఏటా అంబేద్కర్ స్టేడియం వేదికగా ఉచిత వేసవి క్రీడా శిక్షణ శిబిరాలను అట్టహాసంగా నిర్వహిస్తుంటారు. నగరంతోపాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి తల్లిదండ్రులు పిల్లలను ఇక్కడకు పంపిస్తుంటారు. గతేడాది మే, జూన్ నెలలో నిర్వహించిన శిక్షణ శిబిరాల్లో సుమారు 2500 మంది చిన్నారులు శిక్షణ పొందారు. పిల్లలకు శిక్షణ ఇచ్చేందుకు సుమారు 70 మంది కోచ్‌లను క్రీడా శాఖ ఎంపిక చేసింది. శిక్షణ కాలంలో కోచ్‌లకు గౌరవ వేతనంగా కొంత మొత్తాన్ని నగరపాలక సంస్థ ఇస్తోంది. గత వేసవి క్రీడా శిబిరంలో కోచ్‌లకు గౌరవ వేతనం ఇప్పటికీ అందలేదు.పట్టించుకునే వారు కరవు.. కరీంనగర్ బల్దియా ఆధ్వర్యంలో 2023 మే 5 నుంచి జూన్ 7 వరకు 28 అంశాల్లో శిక్షణ ఇచ్చారు. అనంతరం కోచ్‌లకు గౌరవ వేతనం ఇవ్వడం ఆనవాయితీ. వేసవి సెలవుల్లో అందరూ విహారయాత్రలకు వెళ్తుంటే 70 మంది కోచ్‌లు మాత్రం విద్యారులకు క్రీడా నైపుణ్యాలను అందించారు. శిబిరం ముగిసిన తర్వాత వారిని పట్టించుకునే వారే కరవయ్యారు. మళ్లీ వేసవి సమీపిస్తున్న నేపథ్యంలో ఇప్పటికైనా గౌరవ వేతనం ఇవ్వాలని కోచ్‌లు కోరుకుంటున్నారు. తామందరం ప్రైవేటు పాఠశాలల్లో పీఈటీలుగా, క్రీడలకు



కోచ్‌లుగా చాలీచాలని జీతాలతో పని చేస్తున్నామని మొర పెట్టుకున్నా అధికారులు ఆలకించలేదని కోచ్‌లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మేయర్, డీవైఎస్‌వో, జిల్లా ఒలింపిక్ సంఘం బాధ్యులకు విన్నవించుకున్నా లాభం లేదని వాపోతున్నారు. 2018, 2019లో నిర్వహించిన శిబిరాల్లో పాల్గొన్న కోచ్‌లకు ఆరు నెలలు గడిచిన తర్వాత గౌరవ వేతనం ఇచ్చారు. తర్వాత కరోనా కారణంగా శిబిరాలు నిర్వహించలేదు. గతేడాది 2022లో నిర్వహించగా.. ఇప్పటికీ ఇవ్వలేదు.

# బస్తాలు రాక.. లక్ష్యం నెరవేరక..!

మిర్యాలగూడ : కస్టమ్ మిల్లింగ్ బియ్యం తిరిగి ఇచ్చేందుకు ఉమ్మడి జిల్లాలోని పలు రైస్‌మిల్లులకు బస్తాల సమస్య నెలకొంది. ఖరీఫ్ ధాన్యంతో పౌరసరఫరాల శాఖ సరఫరా చేసిన బస్తాలకు కాప్రా పురుగు పట్టడంతో (సన్నని తెల్లపురుగు).. ఈ బస్తాల్లో కస్టమ్ మిల్లింగ్ బియ్యాన్ని భారత ఆహార సంస్థకు లెవీ పెట్టేందుకు మిల్లర్లు ముందుకు రావటం లేదు. పురుగు వచ్చిన బస్తాల్లో భారత ఆహార సంస్థకు బియ్యాన్ని మిల్లర్లు పంపితే వారు వెంటనే తిరస్కరిస్తున్నారు.

పంపిణీ విధానం ఇలా..పౌరసరఫరాల శాఖ ఐకేపీ కేంద్రాల్లో రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యాన్ని 54 శాతం కొత్త బస్తాలు, 46 శాతం పాత బస్తాల్లో మిల్లులకు ధాన్యం లారీల్లో లోడు చేసి పంపుతున్నారు. ధాన్యం మరపట్టిన తరువాత లెవీగా భారత ఆహార సంస్థకు కొత్త బస్తాల్లో నింపి అందించాలి. కొత్త బస్తాలపై ఏసీకే నంబర్లు ముద్రించి మిల్లర్లు లెవీ పెట్టాల్సి ఉంది. గత ఖరీఫ్ ధాన్యం లెవీ పెట్టే విషయంలో జాప్యం అవుతుండగా ప్రస్తుతం ఈ బస్తాల్లో పురుగులు రావటంతో మిల్లర్లు సరఫరా చేయలేకపోతున్నారు. తమకు కొత్తగా బస్తాలు ఇవ్వాలంటూ జిల్లా పౌరసరఫరాల శాఖకు, కలెక్టర్‌కు వినతి పత్రాలు అందిస్తున్నారు. భారత ఆహార సంస్థ నుంచి లెవీకి అనుమతి వచ్చే విషయంలో జరుగుతున్న జాప్యంతో తమ వద్ద నిల్వ ఉంచిన



ధాన్యం మిల్లింగ్‌కు కూడా పనికిరాకుండా పోతుందని మిల్లర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అనుమతి వచ్చిన సమయంలో బస్తాలు ఖాళీ చేసి ధాన్యం మిల్లింగ్ చేసి బియ్యం చేస్తున్నారు.

గతంలో కోటా ఇవ్వని వారికి కొత్త బస్తాలు..

– వెంకటేశ్వర్లు, జిల్లా పౌరసరఫరాల అధికారి, నల్గొండ

ఖరీఫ్ ఐకేపీ ధాన్యం మిల్లులకు పంపిణీ చేసే సమయంలో 54 శాతం కొత్త బస్తాలు ఇవ్వని వారికి మాత్రమే కొత్త బస్తాలు ఇచ్చేందుకు జిల్లా కలెక్టర్ అనుమతించారు. ఈ మేరకు పౌరసరఫరాల శాఖ డీఎం పరిశీలించి కొత్త బస్తాలు ఇస్తున్నారు. అన్ని మిల్లులకు గతంలో పంపిన కొత్త బస్తాలను శుభ్రం చేయించి ఎఫ్‌సీఐకి లెవీ పెట్టాలి.

# నిత్యం రక్తసిక్తం..!

సూర్యాపేట : జాతీయ, ప్రధాన రహదారులు నిత్యం రక్తమోడుతున్నాయి. వాహనాల అతివేగం, చోదకుల నిర్లక్ష్యం అమాయకుల ప్రాణాలను బలిగొంటున్నాయి. ఒక్కరు చేసిన పాపానికి ఎందరో తనువు చాలిస్తున్నారు. తల్లిదండ్రులకు ఆసరా అవుతారనుకున్న కుమారులు దూరమై పుట్టెడు శోకాన్ని మిగులుస్తున్నారు. సూర్యాపేట జిల్లాలో రోజూ ఎక్కడో చోట రహదారి ప్రమాదం జరుగుతూనే ఉంది. సూర్యాపేట జిల్లా వ్యాప్తంగా జనవరి నుంచి ఏప్రిల్ 11 వరకు 102 రోజుల వ్యవధిలోనే 91 మంది మృత్యువాత పడినట్లు పోలీసుల గణాంకాలు వెల్లడిస్తున్నాయి. సూర్యాపేట పురపాలిక పరిధిలో ఈ నెల 4 నుంచి 11 వరకు తొమ్మిది రోజుల వ్యవధిలో జరిగిన వేర్వేరుగా రోడ్డు ప్రమాదాల్లో 13 మంది దుర్మరణం చెందడం విస్మయం కలిగిస్తోంది. ప్రధానంగా వాహనదారులు నిబంధనలు పాటించకపోవడం, అతివేగం వల్ల జరిగిన ప్రమాదాలే ఎక్కువ.

ఈ నెలలో జరిగిన దుర్ఘటనలు ఇవీ..

ఈ నెల 3న కేతేపల్లి మండలం ఇనుపాముల గ్రామం బస్టాండ్ సమీపంలో 65వ నంబరు జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆత్మకూర్(ఎస్) మండలం ఇస్తాళాపురం గ్రామానికి చెందిన మహిళ దుర్మరణం.

4న సూర్యాపేట జిల్లా కేంద్రంలోని మానసనగర్ సమీపంలో కారు, ఆటో, లారీ ఢీకొన్న ఘటనలో ఆరుగురు మృత్యువాత.

5న సూర్యాపేట మండలం రాయినిగూడెం సమీపంలో జాతీయ రహదారిపై గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

7న చిలుకూరు మండలంలోని కవిత జూనియర్ కళాశాల సమీపంలో



వాహనాన్ని లారీ ఢీ కొట్టిన ఘటనలో వ్యక్తి మరణం.

8న సూర్యాపేట మండలం రాజునాయక్‌తండా సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకొన్న ఘటనలో అర్వపల్లి మండలం కొమ్మాల గ్రామానికి చెందిన యువకుడి దుర్మరణం.

9న సూర్యాపేట నుంచి స్వగ్రామం పిల్లలమర్రి గ్రామం వెళ్తుండగా ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ ఢీకొన్న ఘటనలో యువకుడి మృతి.

9న ఆత్మకూర్ మండలం పాతర్లపహాడ్ గ్రామానికి చెందిన బాలుడు ట్రాక్టర్ నడుపుతూ అదుపుతప్పి మృతి.

11న సూర్యాపేట మండలం రాయినిగూడెం సమీపంలో జాతీయ రహదారిపై కారు అదుపుతప్పి చెట్టును ఢీకొన్న ఘటనలో ఇద్దరు యువకులు దుర్మరణం.

11న సూర్యాపేట పట్టణంలోని జాతీయ రహదారి వంతెనపైన డీసీఎంను వెనుక నుంచి కారు ఢీకొన్న ఘటనలో ముగ్గురు యువకులు అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యారు.

కఠిన చర్యలు

–రాహుల్ హెగ్డే, ఎస్పీ, సూర్యాపేట

వాహనదారులు నిబంధనలు పాటించాలి. నిర్లక్ష్యంగా వ్యవహరించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటున్నాం. ఇటీవల రోడ్డు ప్రమాదాలు పెరుగుతున్న నేపథ్యంలో వాహన తనిఖీలను విస్తృతం చేశాం. పరిమితికి మించి ప్రయాణికులను తరలించడం, ఇష్టారీతిన రాకపోకలు సాగించడం మార్చుకోవాలి.

# దేశంలో మోదీ గాలి వీస్తోంది.. మాకు కాంగ్రెస్‌తోనే పోటీ..

## - ప్రజలతోనే ఉంటా.. ప్రజల కోసమే కొట్లాడుతా.. - చేవెళ్ల బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి



హైదరాబాద్: తాను ప్రజలతోనే ఉంటానని... ప్రజల కోసమే కొట్లాడతానని చేవెళ్ల బీజేపీ ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. తన కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నంతో కలిసి ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రధాని మోదీ చేసిన పనులే తన గెలుపునకు బాటలన్నారు. ప్రస్తుతం మోదీ వే నడుస్తుందని.. నో కరెప్షన్.. ఓన్లీ డెవలప్‌మెంట్ అని స్పష్టం చేశారు. బీజేపీ విధానం అంత్యోదయ అని చెప్పారు. కాంగ్రెస్ ది.. చేయి గుర్తుకాదు.. చెంప దెబ్బగుర్తు అని విమర్శించారు. రాహుల్ గాంధీ ప్రధాని కావడం అసాధ్యమని ఆయన అన్నారు. కాంగ్రెస్ ప్రవేశ పెట్టిన ఆరుగ్యారంటీలు అమలు కావన్నారు. తాను ఎంపీగా ఉన్నప్పుడు కేంద్ర నిధులు అన్ని పార్టీల సర్పంచ్‌లకురాజకీయాలకు అతీతంగా ఇచ్చానని తెలిపారు. రూ.11 కోట్ల నిధుల్లో 1,094 పనులకు రూ.7 కోట్ల పై చిలుకు ఖర్చు చేసినట్లు గుర్తు చేశారు. ఎంపీ రంజిత్‌రెడ్డి కేవలం 49 పనులు మాత్రమే చేపట్టారని విమర్శించారు. తాను బీజేపీ హైవే ప్రస్తావన పార్లమెంట్‌లో మాట్లాడి తేవడం జరిగిందన్నారు. కేంద్ర మంత్రి గడ్కరి శంకుస్థాపన చేసినా, అప్పా జంక్షన్ టు మన్నేగూడ రోడ్డు విస్తరణ పనులు పూర్తి చేయడం కాంగ్రెస్, బీఆర్ఎసలకు చేతకాలేదని అన్నారు. తాండూర్ కంది పప్పుకు జియోగ్రాఫికల్ ఇండికేషన్ ఇవ్వాలని ఢిల్లీ స్థాయిలో మొదటి సారిగా గళమెత్తినది తానే అన్నారు. కోట్‌పల్లి ప్రాజెక్ట్ అభివృద్ధి కోసం వంద కోట్లు తీసుకు వచ్చినట్లు చెప్పారు. తాండూరులో నాపరాతి పరిశ్రమకు జీఎస్టీ 18 నుంచి 5 శాతం వరకు తీసుకు వచ్చినట్లు తెలిపారు. తనను మరోసారి చేవెళ్ల ఎంపీగా గెలిపిస్తే.. వికారాబాద్ నుంచి తాండూరు వరకు నాలుగులైన్ల రోడ్డు, శంకర్‌పల్లి నుంచి వయా మోమిన్‌పేట రోడ్డు, అప్పా జంక్షన్ నుంచి మన్నేగూడ వరకు విస్తరణ పనులు పూర్తి చేయిస్తానని హామీ ఇచ్చారు. శంకర్‌పల్లి నుంచి తాండూరు వరకు ఎంఎంటీఎస్ రైలు తీసుకు రావడంలో బీఆర్ఎస్ చేతులెత్తేసిందన్నారు. హైదరాబాద్ నుంచి ముంబయి వరకు బుల్లెట్ ట్రైన్ కోసం సర్వే మొదలైనదని, వికారాబాద్ మొదటి స్టాప్ అని కేవలం 25 నిమిషాల్లోనే చేరుకుంటామన్నారు. బుల్లెట్ ట్రైన్ కోసం ప్రయత్నాలు జరుగుతున్నాయని అన్నారు. సమాజంలో ఎంతో మార్పు వచ్చిందన్నారు. ప్రతి ఒక్కరు బాత్‌రూమ్స్ ఉపయోగిస్తున్నారని బయటకు ఎవరూ వెళ్లడం లేదన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకు వచ్చిన స్వచ్ఛభారత్ కార్యక్రమం విజయవంతమైనట్లు చెప్పారు. ముద్రలోన్ కిందిస్థాయి వారికి ఇచ్చేలా మోదీ ప్రభుత్వం కృషి చేస్తుందని, అలాగే విశ్వకర్మ యోజన పథకం కుమ్మరి, కమ్మరి, వడ్రంగి, రజకులకు ఇలా కుల వృత్తులపై ఆధారపడి జీవించే వారికి చేయూతనందిస్తున్నట్లు చెప్పారు. చేవెళ్లలో త్వరలో బహిరంగ సభను ఏర్పాటు చేయనున్నట్లు, ప్రధాని మోదీ హాజరు కానున్నట్లు చెప్పారు.

**బీఆర్ఎస్ వీక్.. కాంగ్రెస్‌తోనే పోటీ..** బీఆర్ఎస్ చాల వీకైంది. కాంగ్రెస్ తోనే తనకు పోటి అన్నారు. బీఆర్ఎస్ అభ్యర్థిపై కాంగ్రెస్ అకాకుల చవాక్కులు చచ ఏయడం సరైంది కాదని, టీఆర్ఎస్ డమ్మీ క్యాండెట్‌ను పెట్టారనటం తప్పు అని, ఆయన పెద్ద మనిషి ఎంతో అనుభవం ఉన్న వ్యక్తని తెలిపారు. బీజేపీలో మత రాజకీయాలు ఉండవు. తప్పును తప్పంటున్నాము. సమాజంలో చెడుగా ఉన్న త్రిపుల్ తలాక్ తొలగించడంతో ముస్లీ మహిళలు బీజేపీకి మద్దతు తెలుపుతున్నారని తెలిపారు. బీజేపీ సిద్ధాంతం ఉన్న పార్టీ అని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ప్రతి ఒక్కదాట్లో కన్ఫ్యూసగా ఉందని తెలిపారు.

**ఘోరమైన జీవో 69** : ఎన్నికలు వచ్చినప్పుడల్లా జీవో 111పై నేతలు వాగ్దానాలు ఇస్తున్నారని తెలిపారు. చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య, రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్, ప్రతి ఎన్నికల్లో ఇదే చెబుతున్నారని తెలిపారు. జీవో 111 రద్దు చేసి అంతకన్న ఘోరమైన 69 జీవో తీసుకువచ్చారని, ఈ జీవో ఉల్టా పల్టాగా ఉందన్నారు. దీనికి కొత్తగా గౌడ్‌లైన్స్ ఏమి లేవని చెప్పారు. ప్రతి గడపను టచ్ చేస్తున్నట్లు... లక్షలాది మందితోనే కలుస్తున్నానని తెలిపారు. కాంగ్రెస్ అభ్యర్థి రియల్ ఎస్టేట్ వాళ్లతోని కలుస్తన్నట్లు, ఆయనే తన ఇంట్లో ఉండి లేదని చెప్పిస్తారని ఆరోపించారు.

**కరోనా సమయంలో ఎన్నో సేవలు :** కరోనా కాలంలో తాను ఎన్నో సేవలందిచినట్లు చెప్పారు. శానిటైజర్ తయారుపై అవగామన కల్పించడం జరిగిందని, గ్లౌస్, మాస్కులు పంపిణీ చేయడం జరిగిందన్నారు. చేవెళ్లలో 15 బెడ్స్‌తో ఐసోలేషన్ సెంటర్, డాక్టర్లకు ప్రత్యేక మాస్కులు, మహావీర్ ఆసుత్రిలో 20 నాచురల్ వెంటిలేటర్ తయారు చేసి అందించడం జరిగిందన్నారు. ప్రత్యేకంగా ఇండియన్ కోవిడ్ వెంటిలేటర్‌ను తాను తయారు చేయడం జరిగిందన్నారు. రాజకీయాలకు అతీతంగా సేవలందించడం జరిగిందన్నారు. కరోనా సమయంలో మోదీ కోవిడ్ 19 ఇంజక్షన్ తీసుకోవాలని ప్రచారం చేయగా.. చికెన్ బాగా తింటే కరోనా పోతుందని బీఆర్ఎస్ ప్రచారం చేసుకున్నారని, పౌల్ట్రీ బిజినెస్ పెరిగేలా చేసుకున్నారని విమర్శించారు.

# బీజేపీ నేతలు గ్రాఫిక్స్ హీరోలు.. జగ్గారెడ్డి విసుర్లు



హైదరాబాద్: లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ గ్రాఫ్ పడిపోవడంతో కేంద్ర హోంమంత్రి అమిత్ షా, ప్రధానమంత్రి నరేంద్రమోదీలకు నిద్ర పట్టడం లేదని కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి అన్నారు. బీజేపీ నేతలు తాము దేశభక్తులమంటూ డబ్బా కొట్టుకుంటున్నారని ఎద్దేవా చేశారు. అసలైన దేశభక్తులు రాహుల్ గాంధీ కుటుంబమేనని చెప్పారు. రాహుల్ గాంధీకి డబ్బా కొట్టుకోవాల్సిన అవసరం లేదన్నారు. డూప్లికేట్ బీజేపీ నేతలు డబ్బా కొట్టుకుంటున్నారని విమర్శించారు. బీజేపీ నేతలు గ్రాఫిక్స్ హీరోలని సెటైర్లు గుప్పించారు. ఇప్పుడు వస్తున్న సినిమాల్లో పస లేదని చెప్పారు. కేసీఆర్ కామెంట్లపై జగ్గారెడ్డి స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చారు. శుక్రవారం నాడు గాంధీ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ... కేసీఆర్ బయటకు వస్తే తమ అస్త్రాలు తాము బయటకి తీస్తామన్నారు. రేవంత్ రెడ్డి తోపు, భట్టి విక్రమార్క ఇంకో రకం తోపు, ఉత్తమ్ బ్రిలియంట్, కోమటిరెడ్డి బ్రదర్స్ ఇద్దరూ తోపే.. పొంగులేటి శ్రీనివాసరెడ్డి, రేణుక చౌదరి, జీవన్ రెడ్డి, వీహెచ్ తోపులు... పొన్నం ప్రభాకర్, శ్రీధర్ బాబు తోపులేనని అన్నారు. కాంగ్రెస్‌లో అందరూ తోపులేనని చెప్పారు. కేసీఆర్ ఏం చేసినా తమకు ఏం కాదన్నారు. బీఆర్ఎస్‌లో ముగ్గురు, బీజేపీలో ఇద్దరు మాత్రమే లీడర్లని చెప్పారు. కాంగ్రెస్‌లో లీడర్లకు కొదవ లేదన్నారు. తాము పాండవులమని.. విజయం తమవైపే ఉంటుందని చెప్పారు. తెలంగాణ ప్రభుత్వంపై ఏఐసీసీకి పూర్తి నమ్మకం ఉందని తెలిపారు. కేసీఆర్ ఏం మాట్లాడినా తమ వ్యూహం తమకు ఉందన్నారు. తాము చాలా అలెర్ట్‌గా ఉన్నామన్నారు. కేసీఆర్ మైండ్ గేమ్ ఆడుతున్నాడని.. ఆయన మాటలని ప్రజలు సీరియస్ గా తీసుకోవడం లేదని చెప్పారు. తమకు ఎప్పటికప్పుడు సమాచారం వస్తుందన్నారు. రేవంత్ రెడ్డి అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నారని చెప్పారు. కేసీఆర్ మాటలకు ఆగస్టులో సమాధానం చెబుతామని మందలించారు. తమ ఎమ్మెల్యేలు కేసీఆర్‌కి టచ్‌లో ఉన్నారా? బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌తో టచ్‌లో ఉన్నారా అనేది ఎంపీ ఎన్నికలు అయ్యాక తెలుస్తుందన్నారు. ప్రభుత్వం కూలిపోతుందని కేసీఆర్ ఏ ఆలోచనతో అన్నారో ఆయనకే తెలియాలన్నారు. కేసీఆర్ ఏం చేసినా దాన్ని ఎలా తిప్పికొట్టాలో తమకు తెలుసునని జగ్గారెడ్డి అన్నారు.

# కేటీఆర్ ట్వీట్‌కు బల్మూర్ వెంకట్ కౌంటర్

హైదరాబాద్: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ ట్వీట్‌కు కాంగ్రెస్ ఎమ్మెల్సీ బల్మూర్ వెంకట్ కౌంటర్ ఇచ్చారు. తెలంగాణ ఏర్పడ్డాక మొట్టమొదటి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసి, కేసీఆర్, కేటీఆర్ తెలంగాణ సమాజానికి ఒరగబెట్టింది ఏంటని ప్రశ్నించారు. ఇప్పుడు ఇంట్లో కుర్చోబెట్టాక తెలంగాణ యువత గుర్తుకు వచ్చిందా? గత పదేళ్లుగా గుర్తుకు రాలేదా? అని నిలదీశారు. అధికారంలో ఉన్నప్పుడు ఒక్కసారి అయినా వాళ్లని కలిసిన పాపాన పోలేదని.. ఇప్పుడు కేటీఆర్ ఎగిరి గంతేస్తున్నారని దుయ్యబట్టారు. బీఆర్ఎస్ మేనిఫెస్టోలో విద్యార్థులు, యువతకు సంబంధించిన అంశం ఒక్కటి అయినా ఉందా?.. ఇంటికో ఉద్యోగం అనే నినాదంతో 2014లో అధికారంలోకి వచ్చారని, గత పదేళ్లలో ఊరికో ఉద్యోగం కూడా ఇవ్వలేకపోయారని.. కానీ మీ ఇంటి నిండా ఉద్యోగాలే అని బల్మూర్ వెంకట్‌అన్నారు. బీఆర్ఎస్ ఇచ్చిన ప్రతీ నోటిఫికేషన్‌లో చిక్కు ముడులేనని, తాను వేసినవి తప్పుడు కేసులు అయితే, న్యాయస్థానం ఎందుకు ఆ నోటిఫికేషన్‌లను రద్దు చేస్తుందని ప్రశ్నించారు. ఇప్పుడు కేటీఆర్ ఎవ్వరినీ తప్పు పడుతున్నారు? తననా లేక న్యాయస్థానాన్నా?.. ఎమ్మెల్యే పదవిలో ఉండి ఏం మాట్లాడుతున్నారో తెలుసుకోవాలన్నారు.

ప్రభాత సమాచారం
తెలంగాణ తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను...

తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో బ్యూరో ఇంచార్జీలు, స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గ ఇంచార్జీలు, డివిజన్ ఇంచార్జీలతో పాటు మండల కేంద్రాల్లో విలేకరులు కావలెను. అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత ఇవ్వబడును. ఆసక్తి కలిగిన వారు సంప్రదించండి.

సయ్యద్ కరీం ఎడిటర్
9440977660, 9110718194




# బీఆర్ఎస్‌కు బిగ్ షాక్.. కాంగ్రెస్‌లోకి మరో ఎమ్మెల్యే?

హైదరాబాద్, ఏప్రిల్ 19: తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో అనుకోని ఓటమి తర్వాత బీఆర్ఎస్ పార్టీ ఎలాంటి పరిస్థితులను ఎదుర్కొంటుందో అందరికీ తెలిసిందే. బీఆర్ఎస్ అధికారంలోకి రాకపోవడంతో అప్పటి వరకు పార్టీని అంటిపెట్టుకున్న నేతలు ఒక్కొక్కరుగా.. గుడ్‌బై చెప్పేస్తున్నారు. గులాబీ బాస్ కేసీఆర్‌కు ఎంతో నమ్మకంగా ఉన్న ముఖ్యనేతలు కూడా పార్టీకి రాజీనామా చేసి.. కాంగ్రెస్‌లోకి చేరిపోతున్నారు. బీఆర్ఎస్‌కు ఎలాంటి పరిస్థితి ఎదురైందంటే.. ఒకానొక దశలో రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో అభ్యర్థులను కూడా కేసీఆర్ వెతుక్కోవాల్సి దుస్థితి ఏర్పడింది. చివరకి ఎలాగోలా పార్లమెంటు ఎన్నికల్లో పోటీచేయబోయే అభ్యర్థులను ఖరారు చేశారు బాస్. ఇదిలా ఉండగా.. బీఆర్ఎస్ వీడుతున్న వారి సంఖ్య రోజు రోజుకు పెరిగిపోతోంది. ఇప్పటికే ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్, కడియం శ్రీహరి లాంటి ముఖ్యనేతలు పార్టీని వీడి కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. తాజాగా ఆ లిస్టులో మరో కీలక నేత, ఎమ్మెల్యే చేరబోతున్నారనే వార్త జోరుగా వినిపిస్తోంది.

**రేవంత్‌ను కలిసిన ప్రకాష్ గౌడ్ :** రాజేంద్రనగర్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ కాంగ్రెస్‌లో చేరబోతున్నారంటూ ప్రచారం జరుగుతోంది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఎమ్మెల్యే కలవడం ఆ వార్త నిజమనేలా చేసింది. దీంతో కాంగ్రెస్‌లో చేరేందుకు బీఆర్ఎస్ ఎమ్మెల్యే సుముఖంగా ఉన్నట్లు తెలుస్తోంది. జూబ్లీహిల్స్‌లోని నివాసంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసిన ఎమ్మెల్యే.. ఆయనతో చాలా సేపటి వరకు చర్చలు జరిపినట్లు సమాచారం. సీఎం రేవంత్‌ను బీఆర్ఎస్ ఎమ్మెల్యే కలిసిన వీడియో ప్రస్తుతం నెట్టింట్లో హల్‌చల్ చేస్తోంది. రేపు(శనివారం) ప్రకాష్ గౌడ్ కాంగ్రెస్ పార్టీలోని చేరబోతున్నారని తెలుస్తోంది.

**ఆనాడే వార్తలు వచ్చినా...** కాగా.. ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇద్దరూ కూడా మంచి మిత్రులు. వీరిరువురు టీడీపీలో సుదీర్ఘకాలం పనిచేశారు. ఆ తరువాత జరిగిన పరిణామాల్లో ప్రకాష్‌గౌడ్ బీఆర్ఎస్ తీర్థం పుచ్చుకోగా.. రేవంత్ రెడ్డి కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలో రావడం.. రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించడం త్వరత్వరగా జరిగిపోయాయి. అలాగే ప్రకాష్ గౌడ్ బీఆర్ఎస్ తరపున రాజేంద్రనగర్ ఎమ్మెల్యేగా విజయం సాధించారు. అయితే రేవంత్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తొలినాళ్లలోనే ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ ఆయనను కలిశారు. అప్పుడే ఆయన కాంగ్రెస్‌లో చేరబోతున్నారంటూ వార్తలు గుప్పుమన్నాయి. అయితే తాను నియోజకవర్గ సమస్యల పరిష్కారం కోసమే ముఖ్యమంత్రిని కలిసినట్లు చెప్పుకొచ్చారు రాజేంద్రనగర్ ఎమ్మెల్యే. కాగా.. ఇప్పుడు మాత్రం కాంగ్రెస్‌లో చేరేందుకు ప్రకాష్‌గౌడ్ సుముఖత వ్యక్తం చేస్తున్నట్లు తెలుస్తోంది.


# మా ఎమ్మెల్యేలను టచ్ చేస్తే.. మాడి మసైపోతావ్: కేసీఆర్‌పై సీఎం రేవంత్ ఫైర్



మహబూబ్‌నగర్: షెడ్డు నుంచి కారు ఇక బయటకు రాదు.. అది పాడైపోయిందని భారాసను ఉద్దేశించి సీఎం రేవంత్‌రెడ్డి విమర్శించారు. మహబూబ్‌నగర్‌లో ఎంపీ అభ్యర్థి వంశీచంద్‌రెడ్డి నామినేషన్ సందర్భంగా నిర్వహించిన ర్యాలీలో ఆయన పాల్గొని మాట్లాడారు. భారాస అధినేత కేసీఆర్ ఇటీవల చేసిన వ్యాఖ్యలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. "20 మంది ఎమ్మెల్యేలు టచ్‌లో ఉన్నారని కేసీఆర్ అంటున్నారు. ఇక్కడ కాపలా ఉన్నది రేవంత్‌రెడ్డి.

మా ఎమ్మెల్యేలను టచ్ చేస్తే.. మాడి మసైపోతావు. పాలమూరులో అనేక ప్రాజెక్టులు చేపట్టాం. పదేళ్లుగా ఈ జిల్లాను ఎడారిగా మార్చారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ హోదా తెచ్చారా? పార్లమెంటులో నిద్రపోవడానికా భారాసకు ఓటు వేయాలి?" అని రేవంత్ ప్రశ్నించారు.

# హరీష్‌రావు ఆ గట్టునుంటారో?.. ఈ గట్టునుంటారో?



సిద్దిపేట జిల్లా, ఏప్రిల్ 19: మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ చీఫ్ కేసీఆర్‌పైమెదక్ బీజేపీ ఎంపీ అభ్యర్థి రఘు నందన్ రావు కీలక వ్యాఖ్యలు చేశారు. 1985లో కేసీఆర్ మొదటిసారిగా సిద్దిపేట ఎమ్మెల్యేగా గెలిచినప్పటి నుంచి 39 ఏండ్లుగా సిద్దిపేటలో కుటుంబ పాలన సాగుతోందని విమర్శించారు. శుక్రవారం నంగునూర్ మండలం కోనాయి పల్లి వేంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన ఆయన అనంతరం ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... కేసీఆర్ అంటే కాళేశ్వర రావు అంటారు కానీ నంగునూర్‌లోని ఒక్క చెరువులో నీళ్ళు లేవని విమర్శించారు. ఎన్నికలు కవితను తీహార్ జైలు నుంచి బయటకు తెచ్చే ఎన్నికలు కావన్నారు. రఘునందన్‌రావు దుబ్బాకలో ఓడిపోవడం ఎంత నిజమో కామారెడ్డిలో కేసీఆర్‌ను బీజేపీ వాళ్లు ఓడించింది అంతే నిజమన్నారు. తెలంగాణలో ఆడపిల్లలు లిక్కర్ దందా నడపరన్నారు. మరికొద్ది రోజుల్లో కేసీఆర్ ఇంట్లో వాళ్ళు జైలుకు వెళ్లక తప్పదంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు.

**దేశం బాగుంటాలంటే? :** రూ.1600 కోట్లతో సిద్దిపేట నుంచి ఎలకతుర్తి వరకు కేంద్ర నిధులతో రోడ్ పనులు నడుస్తున్నాయన్నారు. ఇంకా ఐదేండ్లు ఉచిత రేషన్ బియ్యం అందిస్తామన్నారు. రేవంత్ రెడ్డి గెలిచి నాలుగు నెలలు అయినా రూ.4 వేల పింఛన్ ఇవ్వలేదన్నారు. రేవంత్ రెడ్డి లంకె బిందెలు ఉన్నాయని అధికారంలోకి వచ్చాడా?.. లేదా ఖాళీ బిందెలు ఉన్నాయని అధికారంలోకి వచ్చాడా? అని వ్యాఖ్యలు చేశారు. మోదీ రైతులకు సబ్సిడీతో ఎరువుల బస్తాలు అందించారన్నారు. హరీష్ రావు గట్టు మీద నిల్చున్నారని.. కాంగ్రెస్‌లోకి పోతారా?.. అందులోనే ఉంటారా? అనేది తెల్వదంటూ కామెంట్స్ చేశారు. ఈ దేశం బాగుండాలి అంటే బీజేపీ గెలవాలన్నారు. రాష్ట్రంలో ఒక్క ముదిరాజ్ ఎమ్మెల్యే గెలిస్తే ఎందుకు మంత్రి పదవి ఇవ్వలేదన్నారు. రేవంత్ రెడ్డి డిసెంబర్ 9 న రెండు లక్షల రుణమాఫీ చేస్తానని నేటికీ రుణమాఫీ చేయలేదని విమర్శించారు. దేశంలోని ఇస్లామిక్ తీవ్రవాదం పోవాలి అంటే.. హిందూ మత రక్షణ జరగాలి అంటే నరేంద్ర మోడీ గెలవాలన్నారు.

కాంగ్రెస్ పార్టీ కులం పేరుతో చేస్తున్న రాజకీయాలను తిప్పి కొట్టాలని రఘునందన్ రావు పిలుపునిచ్చారు.

# ఢిల్లీ లిక్కర్ స్కాం కేసులో అప్రూవర్ గా మారిన శరత్ చంద్రారెడ్డి




ఢిల్లీ: ఢిల్లీ లిక్కర్ స్కాం కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. లిక్కర్ స్కామ్ సీబీఐ కేసులో శరత్ చంద్రారెడ్డి అప్రూవర్ గా మారారు. 164 సెక్షన్ కింద ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి ముందు శరత్ చంద్రారెడ్డి వాంగ్మూలం ఇచ్చారు. ఈడీ కేసులో శరత్ చంద్రారెడ్డి అప్రూవర్ గా మారిన సంగతి తెలిసిందే. సీబీఐ కేసులో కూడా అప్రూవర్ గా మారడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఢిల్లీ లిక్కర్ స్కాం కేసులో ఇప్పటికే మాగుంట రాఘవ, దినేష్ అరోరా అప్రూవర్ గా మారారు. ఆ జాబితాలో శరత్ చంద్రారెడ్డి చేరారు. తెలంగాణలో భూముల కొనుగోలు లావాదేవీల వ్యవహారాల్లో శరత్ చంద్రారెడ్డిని ఎమ్మెల్సీ కవిత బెదిరించారని సీబీఐ అభియోగాలు మోపిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో శరత్ చంద్రారెడ్డి అప్రూవర్ గా మారారు. లిక్కర్ స్కామ్ లో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవితను ఈడీ అరెస్ట్ చేసింది. తీహర్ జైలులో ఉన్న కవితపై సీబీఐ కూడా విచారించి, అరెస్ట్ చేసింది. ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ ను ఈడీ అధికారులు అరెస్ట్ చేసిన సంగతి తెలిసిందే. కేజ్రీవాల్ కుట్రతోనే లిక్కర్ స్కాం జరిగిందని ఈడీ అభియోగాలు మోపింది.

# నా భార్య నన్ను కొడుతోంది.. ప్లీజ్ విడాకులిప్పించండి..!

హైదరాబాద్‌లో విచిత్ర కేసు వెలుగు చూసింది. తన భార్య నుంచి విడాకులు ఇప్పించాలని డిమాండ్ చేస్తూ ఓ వ్యక్తి చెరువులోకి దిగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. డైవర్స్‌కి ప్రధాన కారణంగా.. తన భార్య తనను కొడుతోందని సదరు వ్యక్తి చెబుతున్నాడు. 'నా భార్య నన్ను కొడుతోంది. నాకు విడాకులు ఇప్పించండి. లేదంటే సచ్చిపోతా' అంటూ చెరువులోకి దిగాడు. ఇందుకు సంబంధించిన పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. కొంపల్లికి చెందిన నగేష్. జయభేరి పార్క్ చెరువులోకి దిగి నానా రచ్చ చేశాడు. చాలా సమయం చెరువులోనే ఉండటంతో గమనించిన స్థానికులు.. అతన్ని బయటకు తీసుకువచ్చేందుకు ప్రయత్నించారు. అయితే, చెరువు నుంచి బయటకు వచ్చేందుకు నగేశ్ నానా రచ్చ చేశాడు. తాను బయటకు రానంటే రానంటూ మొండికేశాడు. చివరకు స్థానికులు అతన్ని బయటకు తీసుకువచ్చారు అసలు ఎందుకు చెరువులోకి దిగావని ఆరా తీయగా.. అసలు విషయం చెప్పాడు. తన గోడును వెల్లబోసుకున్నాడు. తన భార్య తనను రోజూ కొడుతోందని, చిత్ర హింసలకు గురి చేస్తోందని నగేష్ వాపోయాడు. వాతలు పెడుతోందని ఆవేదన వ్యక్తం చేశాడు. తన భార్య తనను కొట్టిన తాలూకు గాయాలను చూపించాడు. 'నా భార్య నన్ను కొడుతోంది. కాలుస్తోంది. వాతలు పెడుతోంది. నా పిల్లల దగ్గరకు కూడా వెళ్లనివ్వడం లేదు. డాడీ చనిపోయాడని చెప్పాలంటూ పిల్లలకు నేర్పిస్తోంది. రోజూ టార్చర్ పెడుతోంది. ఇక నా వల్ల కాదు. ఆమెతో నేను ఉండలేదు. నాకు విడాకులు ఇప్పించండి. లేదంటే నేను చనిపోతా' అంటూ నగేష్ ఆవేదన వ్యక్తం చేశాడు. కాగా, నగేష్ చెప్పిన విషయాలను వీడియో తీసిన స్థానికులు దానిని సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. దాంతో అదికాస్తా వైరల్‌గా మారింది.

PRINTED, PUBLISHED, EDITED AND OWNED BY SYED. KAREEM. PRINTED AT MUZAMMIL PRINTERS BOKKALGUDA, ADILABAD-504001
PUBLISHED AT D.NO. 4-4-122/10/B, VIDYANAGER, ADILABAD - 504001. TELANGANA STATE, REGD. NO. APTEL/2011/41055 ìEDITOR : SYED. KAREEMî CELL - 94409 77660